Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 268 | బుధవారం 08 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


**స్వామి వివేకానంద**



ఏదో ఒక ఆదర్శాన్ని కలిగివున్న వ్యక్తి వెయ్యి పొరపాట్లు చేస్తే, ఏ ఆదర్శమూ లేనివాడు యాభైవేల పొరపాట్లు చేస్తాడని నేను గట్టిగా నమ్ముతున్నాను. కాబట్టి, ఒక ఆదర్శాన్ని కలిగివుండడం మంచిది.


Scanned with CamScanner

IRS PUBLICATIONS

irspublications12@gmail.com


### గాజాలో 8 వేల మందికిపైగా

# చిన్నారులు గల్లంతు

**గాజా - సూర్య వాస్తవం**



2023 అక్టోబర్ 7న ప్రారంభమైన పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఈ దాడుల వల్ల లక్షలాది మంది మరణించారు. 29 నెలలపాటు జరిగిన ఇజ్రాయిల్ దాడుల వల్ల గాజాలో 21,510 మంది మృతి చెందారు. ఇప్పటికీ 8 వేల మంది చిన్నారులు ఆచూకీ లేరు. బాంబుల దాడికి కూలిపోయిన భవనాల శిథిలాల కింద 2,100 మంది చిక్కుకుపోయారని తాజాగా పాలస్తీనా కేంద్రం వెల్లడించింది. వేలాది మంది చిన్నారులు అదృశ్యమవ్వడంపై పాలస్తీనా ఆందోళన వ్యక్తం చేసింది. గాజాలో వివిధ ప్రాంతాల్లో సుమారు 200 మంది మైనర్లు ఆచూకీ లేకుండా అదృశ్యమయ్యారు. ఇజ్రాయిల్ దాడుల వల్లే వారు గల్లంతయ్యారని అనుమానాలున్నాయని పాలస్తీనా కేంద్రం నివేదించింది. ఇజ్రాయిల్ దాడులకు గురైన అత్యంత ప్రభావితమైన ప్రాంతంలోనూ, మానవతా సహాయం కోసం ఎదురుచూసే ప్రదేశాల్లోనూ, ఆహారం కోసం వెతుకున్నప్పుడు గానీ పిల్లలు అదృశమయ్యారని పాలస్తీనా కేంద్రం నివేదిక వివరించింది.

### ఐదు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్‌పై

# నిషేధం విధించిన ఈసీ

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**




ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7.00 గంటల నుంచి ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 6.30గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ సర్వే నిర్వహించడం, వాటి ఫలితాలను వెల్లడించకూడదని ఎన్నికల కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్దిష్ట సమయంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం లేదా వెల్లడించడం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126ఎను ఉల్లంఘించడమేనని హెచ్చరించింది. ఉల్లంఘించిన వారికి రెండేండ్ల కఠిన కారాగారశిక్ష లేదా జరిమానా , లేదా రెండూ అమలు చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపింది. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సహా కేరళ, అసోం రాష్ట్రాల్లో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు ఏప్రిల్ 30 వెలువడనున్నాయి. కేరళ, పుదుచ్చేరిల్లో మంగళవారం సాయంత్రం 6.00గంటలకు ప్రచారాన్ని నిలిపివేయాల్సి వుండగా, అసోంలో సాయంత్రం 5.00గంటల నుంచి నిషేధం అమలు కానుంది. పరిమిత సంఖ్యలో పార్టీ కార్యకర్తలు లేదా అభ్యర్థి ఇంటింటికి వెళ్లి చేసే ప్రచారం మినహా, మరే ఇతర ప్రచారానికి అనుమతి లేదు.



### మీ డాష్ కామెంట్‌కు నేను రాష్ కామెంట్

# చేయబోను

### - కేరళ సీఎం పినరయి విజయన్‌కు రేవంత్ రెడ్డి కౌంటర్

**హైదరాబాద్- సూర్య వాస్తవం**

తెలంగాణ, కేరళ రాష్ట్రాల మధ్య అభివృద్ధిపై మొదలైన మాటల యుద్ధం మరింత ముదిరింది. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఘాటైన పదజాలంతో, స్పష్టమైన గణాంకాలతో బదులిస్తూ ఒక బహిరంగ లేఖ రాశారు. తాను గౌరవప్రదంగా విమర్శలు చేసినప్పటికీ, విజయన్ మాత్రం అమర్యాదకరమైన భాషను ఉపయోగించారని రేవంత్ ఆక్షేపించారు. "మీ డాష్ కామెంట్‌కు నేను రాష్ కామెంట్ చేయబోను" అంటూ చురక అంటించిన ఆయన, మీరు మా రాష్ట్రానికి వచ్చినప్పుడు అతిథికి ఇవ్వాల్సిన పూర్తి గౌరవం ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు, ఇదే నా చివరి స్పందన అంటూ రేవంత్ రెడ్డి తన లేఖను ఎక్స్ లో పంచుకున్నారు.


**పాత లెక్కలు కాదు... కొత్తవి చూడండి**

తెలంగాణ ప్రస్తుత పనితీరుపై తీర్పు ఇవ్వడానికి పినరయి విజయన్ 2023-24 నాటి నీతి ఆయోగ్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచీని ఉటంకించడంపై రేవంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ సూచీ పదేళ్ల

- మిగతా 2లో..

# సౌర విద్యుత్‌పై ప్రధాన దృష్టి

- రాయలసీమలో భారీ ప్రాజెక్టులు
- మరో 39.436 కోట్లతో కొత్త ప్రాజెక్టులు
- ఎస్ఐపిబి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు




**అమరావతి - సూర్య వాస్తవం**

సౌర విద్యుత్ ప్రాజెక్టుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చందబాబు నాయుడు సూచించారు. మంగళవారం జరిగిన 16వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రు. 39,436 కోట్ల విలువైన పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 1,11,278 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు వివరించారు. రాష్ట్రంలో సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకుగాను అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో ఈ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చంద్రబాబు సూచించారు. అలాగే ఉత్పత్తికి అనుగుణంగా విద్యుత్ను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసేందుకు ట్రాన్స్ మిషన్ లైన్లను కూడా

- మిగతా 2లో..



# 'మావిగన్' నుంచి డైవర్షన్ కోసమే

### - ఏబీఎన్ రాధాకృష్ణ ఈ వ్యాఖ్యలు చేశారు : జగన్

**అమరావతి- సూర్య వాస్తవం**

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసీపీ నాయకుల భార్యలను ఉద్దేశించి రాధాకృష్ణ అత్యంత అసహ్యకరమైన, దిగజారిన భాషను ఉపయోగించారని, ఇది మహిళలను ఉద్దేశపూర్వకంగా అవమానించడమేనని జగన్ తీవ్రంగా ఖండించారు. ఈ వ్యాఖ్యలు కేవలం విమర్శ కాదని, మహిళల ఆత్మగౌరవంపై చేసిన దాడిగా

- మిగతా 2లో..

# ఆలస్యం వద్దు

### - గృహప్రవేశాలపై సీఎం చంద్రబాబు ఆదేశం
### - మరోసారి సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమం



**అమరావతి - సూర్య వాస్తవం**

ఈ ఏడాది మరోసారి సామూహిక గృహప్రవేశ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై మంగళవారం ఆర్‌టిజిఎస్ నుండి ఆయన సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి




### రాష్ట్రంలో ప్రతి ఉద్యోగాన్ని

# పక్కాగా ట్రాక్ చేయాలి

### - మంత్రి నారా లోకేశ్

**అమరావతి- సూర్య వాస్తవం**

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కలిపి 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ఇప్పటివరకు ఇచ్చిన ప్రతి ఉద్యోగాన్ని పక్కాగా ట్రాక్ చేయాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటు చేసిన మంత్రుల ఉపసంఘం సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.

- మిగతా 2లో..

# మీ డాష్ కామెంట్‌కు నేను రాష్ కామెంట్ చేయబోను

(మొదటిపేజీ తరువాయి)
బీఆర్ఎస్-బీజేపీ పాలన చివరి రోజులను ప్రతిబింబిస్తుందని, 28 నెలల క్రితం 2023 డిసెంబరులో ఆ పాలన ముగిసిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ పనితీరును కొత్త గణాంకాలతో అంచనా వేయాలని ఆయన సవాలు విసిరారు.
"2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ జీఎస్‌డీపీ రూ. 16.12 లక్షల కోట్లకు చేరింది. జాతీయ సగటు 9.9 శాతం ఉండగా, తెలంగాణ వృద్ధి రేటు 10.1 శాతంగా నమోదైంది. ఆర్బీఐ స్టాటిస్టిక్స్ 2024-25 నివేదిక ప్రకారం, రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 3.87 లక్షలకు పెరిగింది. ఈ విషయంలో కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, చివరకు కేరళను కూడా అధిగమించి దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది" అని రేవంత్ రెడ్డి తన లేఖలో స్పష్టంగా వివరించారు.
కేరళ సాధించిన విజయాలు కొన్ని దశాబ్దాల కృషి ఫలితమని అంగీకరిస్తూనే, ప్రత్యేకంగా విజయన్ హయాంలో ఏం జరిగిందో అక్కడి ప్రజలకు వివరించాలని హితవు పలికారు.

**పేదరిక నిర్మూలన, అవినీతిపై సూటి ప్రశ్నలు**

2025 చివరి నాటికి కేరళ తీవ్ర పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించిన తొలి రాష్ట్రంగా అవతరిస్తుందని విజయన్ చేసిన ప్రకటనను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. "ఇప్పుడు ఏప్రిల్ 2026 నడుస్తోంది. ఇంకా 64,006 కుటుంబాలకు మైక్రో-ప్లాన్‌లు అందుతున్నాయని మీరే లేఖలో చెబుతున్నారు. మరి తీవ్ర పేదరికం నిజంగా నిర్మూలించబడిందా? నవంబర్ 1, 2025 నాటి మీ ప్రకటనను ఏదైనా స్వతంత్ర సంస్థ ధృవీకరించిందా?" అని నిలదీశారు. నీతి ఆయోగ్ అవినీతి ర్యాంకింగ్స్‌ను తాను గౌరవిస్తానని, కానీ కేరళ నిజంగానే అవినీతి రహిత రాష్ట్రమైతే ముఖ్యమంత్రి కార్యాలయంతో సంబంధాలున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న గోల్డ్ స్మగ్లింగ్ కేసు ఎందుకు పరిష్కారం కాలేదని ప్రశ్నించారు. అలాగే, శబరిమల అయ్యప్ప ఆలయం నుంచి మాయమైనట్లు ఆరోపణలున్న 4.5 కిలోల బంగారం లెక్క తేలలేదని గుర్తుచేశారు.

**మాది 'తెలంగాణ రైజింగ్' విజన్**

తమ ప్రభుత్వ దార్శనికతను వివరిస్తూ.. 'తెలంగాణ రైజింగ్' తమ లక్ష్యమని రేవంత్ పేర్కొన్నారు. దశాబ్దంలో రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ధ్యేయమన్నారు. హైదరాబాద్ సమీపంలో 'ఫ్యూచర్ సిటీ', జహీరాబాద్‌లో 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్' ఈ లక్ష్య సాధనకు మూలస్తంభాలుగా నిలుస్తాయని తెలిపారు. కేరళలో రాబోయే కొత్త ప్రభుత్వం 'నవ కేరళం' విజన్‌ను అమలు చేస్తుందని తాను విశ్వసిస్తున్నానని, త్వరలోనే అక్కడి ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటారంటూ విజయన్‌కు చురకలు అంటించారు.

# 'మావిగన్' నుంచి డైవర్షన్ కోసమే

(మొదటిపేజీ తరువాయి)
భావించాలని ఆయన అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేశారు.

**జగన్ ట్వీట్ ఇదే...!**

"రేపు వైయస్ జగన్ మోహన్ రెడ్డి మీ భార్యలను మీ భార్యలు కాదని చెబితే, మీరు దాన్ని నమ్మి, మీ సొంత భార్యలను అక్కచెల్లెళ్లుగా భావించి మరీ పెళ్లి సంబంధాలు చూసే స్థాయికి దిగజారిపోతారు. అంతగా వెన్నెముకలేని నాయకులు వైసీపీలో ఉన్నారు!" అంటూ వేమూరి రాధాకృష్ణ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ లో వ్యాఖ్యానించారు. మహిళలను ఉద్దేశించి ఇలాంటి అసహ్యకరమైన, దిగజారిన భాషను ఉపయోగించడం, వారిని రాజకీయ చర్చల్లోకి లాగడం విమర్శ కానే కాదు. ఆ వ్యాఖ్యలు మహిళలను అవమాన పరచడమే కాకుండా, వారిని కించపరిచేలా చేసిన దాడిగానే భావించాలి. ఎలాంటి వివక్ష పూరిత జర్నలిజం చేస్తున్నారన్నదానిపై ఈ వ్యాఖ్యలు తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతు న్నాయి. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము. ఇవి మహిళలను అవమానించడానికే కాదు, ప్రజల్లో 'మావిగన్ ప్రతిపాదనపై జరుగుతున్న చర్చను దారి మళ్లించడానికి ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నం. 'మావిగన్ ' ప్రతిపాదనను రాజకీయంగా ఎదుర్కోలేక, చంద్రబాబు, ఆయనకు అనుకూలంగా ఉన్న మీడియా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోంది. దీంట్లో భాగంగా తప్పుడు ప్రచారాలు చేయడమే కాకుండా దూషణలకు కూడా దిగారు. మేము శాంతియుతంగా నిరసనలు చేపట్టి, రాధాకృష్ణపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాం. ఇంత తీవ్రమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ, మా నాయకులు, కార్యకర్తలు ఎక్కడా హింసకు పాల్పడకుండా, శాంతియుతంగా, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ అత్యంత సంయమనంతో వ్యవహరించారు. ఈ జుగుప్సాకర వ్యాఖ్యలను ఖండించకుండా, చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఈ వ్యాఖ్యలకు మద్దతు ఇవ్వడం, మహిళల పట్ల వారికి ఉన్న అవమానకర ధోరణిని, ద్వేషభావాన్ని చూపిస్తోంది. రాధాకృష్ణపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. బాధ్యతారహిత, విషపూరిత వ్యాఖ్యలను సమర్థించిన నాయకుల వైఖరిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం" అంటూ జగన్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

# తౌషిక్ మృతి ఘటనపై ఫోరెన్సిక్ నిపుణులతో దర్యాప్తు

## - ప్రకాశం జిల్లా ఎస్పికి హైకోర్టు ఆదేశం

**అమరావతి - సూర్య వాస్తవం:** ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని శ్రీచైతన్య నవోదయ పాఠశాలలో చదువుతున్న 11 ఏళ్ల మైనర్ బాలుడు సయ్యద్ తౌషిక్ మృతి ఘటనపై ఫోరెన్సిక్ నిపుణులతో దర్యాప్తు చేయించాలని ఆ జిల్లా ఎస్పికి హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి, అతని కుమారుడు చైతన్య, వార్డెన్ బాజ్జీ ఇతరులను ఇదేశించింది. విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. తౌషిక్‌పై పాఠశాల కరస్పాండెంట్ కుమారుడు చైతన్య, వార్డెన్ బాజ్జీ దాడి చేసి హతమార్చారని, అయితే పోలీసులు ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, దీనిపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశాలివ్వాలని కోరుతూ తల్లిదండ్రులు సయ్యద్ అలీ, ముహ్మద్ మౌలీ బీ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు గతంలోనే అడిషనల్ ఎస్పి స్థాయి అధికారితో దర్యాప్తు చేయించాలని పోలీసులను ఆదేశించింది. ఆత్మహత్య కాదని, హత్య చేశారని న్యాయవాది తాండవ యోగేష్ వాదించారు. బాత్రూంలోని హ్యాంగర్ బాలుడి ఎత్తు కంటే తక్కువ ఎత్తులో ఉందని, అక్కడ ఆత్మహత్య చేసుకోలేడని వివరించారు. జిల్లా ఎస్పి తరపున అడ్వకేట్ జనరల్ (ఎజి) దమ్మాలపాటి శ్రీనివాస్, పాఠశాల యాజమాన్యం తరపున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, ఆకుల శ్రీకృష్ణ భార్గవ్ వాదించారు.

# సౌర విద్యుత్‌పై ప్రధాన దృష్టి

(మొదటిపేజీ తరువాయి)
ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 325 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి ఆస్కారం ఉందని అధికారులు సిఎంకు వివరించారు. ఇలా ఉత్పత్తి చేసిన విద్యుత్ను రాష్ట్ర, కేంద్ర గ్రిడ్లకు అను సంధానం చేసేలా చూడాలని మంత్రి లోకేష్ సూచిం చారు. రాజస్థాన్లో సౌర విద్యుత్ను తయారుచేస్తున్నా, పూర్తిగా వినియోగించుకోలేని పరిస్థితులు అక్కడ ఉన్నాయని, రాష్ట్రంలో అలాంటి పరిస్థితులు రాకూడదని చంద్రబాబు అన్నారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో కూడా పెట్టుబడులు వచ్చేలా చూడాలన్నారు.

**ఆధనిక భద్రతా ప్రమాణాలు పాటించాలి**

రాష్ట్రంలో ఏర్పాటుచేసే పరిశ్రమల్లో అత్యాధునిక భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలని సిఎం నిర్దేశించారు. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నా తట్టుకునేలా ఈ ప్రమాణాలు ఉండాలని అన్నారు. ఫార్మా, స్టీల్, గ్రీన్ ఎనర్జీ వంటి పరిశ్రమలు వస్తున్నందున సేఫ్టీ మరింతగా ఉండాలన్నారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన బాణాసంచా పేలుళ్ల ఘటనలను ప్రస్తావిస్తూ ప్రమాణాల విషయంలో రాజీ ఉండరాదని చెప్పారు. ఇప్పటివరకు అనుమతులు పొందిన, ఒప్పందాలు కుదిరిన ప్రాజెక్టులను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. ఎస్ఐపిబి సమా వేశాల్లో అనుమతి పొందిన, భాగస్వామ్య సదస్సులో ఒప్పం దాలు కుదుర్చుకున్న పరిశ్రమలపై దృష్టి పెట్టి అవి త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలని నిర్దేశించారు. ఇప్పటివరకు రు. 20.74 లక్షల కోట్ల పెట్టు బడులకు ఒప్పందాలు చేసుకోగా, 23. 55 లక్షల మందికి ఉపాధి లభించనుందని వివరించారు.

**31 ప్రాజెక్టులకు అనుమతి**

తాజా ఎస్ఎల్ సి సమావేశంలో 31 ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వగా, అందులో విద్యుత్ రంగంలో ఎనిమిది పెట్టుబడులకు రు. 12,552 కోట్ల వ్యయంతో 69,070 మంది ఉపాధి లభించనుందని అధికారులు వివరించారు.
ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగంలో రు.18,210 కోట్లతో 11 పెట్టుబడులు, పర్యాటక రంగంలో రు. 200.15 కోట్లతో రెండు పెట్టుబడులకు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రు. 1,222 కోట్లతో రెండు పెట్టుబడులకు, పరిశ్రమలు కామర్స్ రంగంలో 7,251 కోట్లతో ఎనిమిది పెట్టుబడులకు ఆమోదం తెలిపారు.

# ఆలస్యం వద్దు

(మొదటిపేజీ తరువాయి)
ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలను పక్కా ప్రణాళికతో అమలు చేయాలన్నారు. టిడ్కో ఇళ్లతోపాటు మరో ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే విషయంలో ఎక్కడా ఆలస్యం కాకూడదని, ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వమూ చేయని విధంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నా మన్నారు. ఇంటిస్థలాల పంపిణీ ప్రక్రియ కూడా వేగవంతం కావాలని, సుమారు రెండు లక్షల మంది ఇళ్లు కావాలని కోరినట్లు సర్వేలో తేలిందన్నారు. ఇళ్ల నిర్మాణాన్ని ఎంత వేగంగా చేపడుతున్నారో పంపిణీ కూడా అదేస్థాయిలో ఉండాలని అన్నారు. వర్షాకాలంలో ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా ఇప్పటి నుండే జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలకు ఉచితంగా ఇసుకను ఇస్తున్నా మని, రీచ్‌లు, స్టాక్‌యార్డుల వద్ద రవాణా పేరుతో ఎక్కువ ఛార్జీలు వసూలు చేయడానికి వీల్లేదని పేర్కొన్నారు. దీనిపై నిఘా పెట్టాలని అన్నారు.
మరింత పటిష్టంగా కాలేజీ విద్య
కాలేజీ విద్యను పటిష్టంగా తీర్చిదిద్దాలని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కాలేజీ విద్యను రీ ఓరియంటేషన్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు అధ్యయనం చేయాలని, యూనివర్శిటీలతో నిత్యం అనుసంధానం చేసుకోవాలని అన్నారు. సాంప్రదాయ కోర్సులతో పాటు డిమాండ్ ఉన కోర్సులకు కొత ?తకరిక్యులంను ప్రవేశపెట్టేలా కసరత్తు చేయాలని చెప్పారు. యూనివర్శిటీల ర్యాంకింగు కూడా పెంచేలా చూడాలని, హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ మరింత చురుకుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన విషయంలో ఎలాంటి ఫిర్యాదులుగానీ, విమర్శలు గానీ రాకూడదని తెలిపారు. శాప్ విభాగం యాక్టివిటీని పెంచుకోవాలని అన్నారు. పోలీసుశాఖ త్రిపుల్ రైడింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు కఠినతరం చేయడానికి ముందు ప్రజలను ఎడ్యుకేట్ చేయాలని అన్నారు. విద్యుత్ తీగలు చాలా ప్రాంతాల్లో కిందకు ఉంటున్నాయని, వాటిని తగిలి ప్రజల ప్రాణాలకు ఇబ్బంది లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిడుగుపాట్లపై అవగాహన పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌టిజిఎస్ రూపొందించిన అవేర్ 2.0 మొబైల్ యాప్‌ను సిఎం ప్రారంభించారు.

# రాష్ట్రంలో ప్రతి ఉద్యోగాన్ని పక్కాగా ట్రాక్ చేయాలి

(మొదటిపేజీ తరువాయి)
రాష్ట్రానికి ఇప్పటివరకు వచ్చిన పరిశ్రమలు, వాటి ద్వారా కల్పించిన ఉద్యోగాలు, ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్టుల గ్రౌండింగ్ పురోగతిపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఇప్పటివరకు రాష్ట్ర యువతకు వివిధ రంగాల్లో 6.25 లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని చేరుకోవడానికి అనుసరిస్తున్న వ్యూహాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లా డుతూ, "యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని
మేము వాగ్దానం చేశాం. ఆ లక్ష్య సాధనకు ప్రతిఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలి. నైపుణ్యం పోర్టల్ తరహాలోనే, ఆధార్ లేదా కేవైసీ అనుసంధానంతో ప్రతి ఉద్యోగాన్ని ట్రాక్ చేసేందుకు ఒక బలమైన వ్యవస్థను రూపొందించాలి" అని స్పష్టం చేశారు. ప్రభుత్వ దృష్టిలో చిన్న పరిశ్రమలు, పెద్ద పెట్టుబడులు రెండూ సమానమేనని, ఉద్యోగాల కల్పనే తమకు అత్యంత ముఖ్యమని ఆయన తేల్చిచెప్పారు. పెట్టుబడుల గ్రౌండింగ్‌పై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. దీనిపై ప్రతివారం సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతుల ప్రక్రియను సింగపూర్, దుబాయ్ కంటే సులభతరం చేయాలని మంత్రి లోకేశ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. "పరిశ్రమలకు అవసరమైన అన్ని శాఖల అనుమతులు, నిరభ్యంతర పత్రాలను (ఎన్వోసీ) మ్యాపింగ్ చేసి, వాటి పురోగతిని పర్యవేక్షించేందుకు ఒక ట్రాకింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలి. ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్న 787 కంపెనీలను నిరంతరం ట్రాక్ చేస్తూ, అవి కార్యరూపం దాల్చేలా చూడాలి" అని ఆదేశించారు. ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఈడీబీ)ను మరింత బలోపేతం చేయాలని, ప్రతి శాఖ ఈడీబీ ట్రాకర్‌ను పర్యవేక్షించేందుకు ఒక సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్‌ను నియమించాలని సూచించారు. ఎంఎస్ఎంఈ పార్కులు, టెక్స్‌టైల్ ఇండస్ట్రీకి పవర్ బ్యాంకింగ్ వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు.
ఈ ఉన్నతస్థాయి సమా వేశంలో మంత్రులు టీజీ భరత్, కొల్లు రవీంద్ర, పి. నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేశ్, కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, పరిశ్రమలు, ఐటీ, నైపుణ్యాభివృద్ధి తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తన సొంత నియోజకవర్గానికి నిధులు విడుదల చేసిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పయ్యావుల కేశవ్ తన సొంత నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు.ఈ నిధుల కేటాయింపు ద్వారా వచ్చిన రూ. 23.53 కోట్ల నిధులతో నియోజకవర్గంలోని రహదారుల రూపురేఖలు మారనున్నాయి.హోన్నూరు రోడ్డు: దీని కోసం రూ. 4.91 కోట్లు కేటాయించారు. ఇది ఆ ప్రాంత ప్రయాణీకులకు పెద్ద ఊరటనిస్తుంది.గంజికుంట - జె. రాంపురం రోడ్డు: దీని నిర్మాణానికి రూ. 3.84 కోట్లు మంజూరయ్యాయి. మిగిలిన నిధులను నియోజకవర్గంలోని ఇతర ప్రధాన అంతర్గత రహదారులు మరియు కనెక్టివిటీ రోడ్ల కోసం ఖర్చు చేయనున్నారు.

**దీనివల్ల కలిగే ప్రయోజనాలు**

మెరుగైన రవాణా గ్రామాల నుంచి మండల కేంద్రాలకు ప్రయాణం సులభతరం అవుతుంది. రహదారులు బాగుంటే రైతులు తమ పండించిన పంటను మార్కెట్‌కు త్వరగా తరలించే అవకాశం ఉంటుంది.రియల్ ఎస్టేట్ -ఉపాధి మౌలిక సదుపాయాల మెరుగుదల వల్ల స్థానికంగా భూముల విలువ పెరగడంతో పాటు, నిర్మాణ పనుల ద్వారా స్థానికులకు ఉపాధి లభిస్తుంది. ఆర్థిక మంత్రి హోదాలో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి ఇంత పెద్ద మొత్తంలో నిధులు తీసుకురావడం పట్ల స్థానిక ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ పనులు త్వరగా పూర్తయితే ఉరవకొండ రూపురేఖలు మరింత మెరుగుపడతాయి.

# ఆంధ్రజ్యోతి రాధాకృష్ణపై ధ్వజమెత్తిన సి.పి. వీరన్న

## - పక్షపాత రాతలు మానుకోవాలని హెచ్చరిక



**ఉరవకొండ-సూర్య వాస్తవం :** ఆంధ్ర జ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మరియు కార్యకర్తలపై చేసిన వ్యాఖ్యల పట్ల జిల్లా అధికార ప్రతినిధి సి.పి. వీరన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు.వ్యక్తిగత దూషణలు సరికాదు పత్రికా రంగంలో ఉంటూ ఒక పార్టీ నాయకుడిని, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేయడం రాధాకృష్ణ అహంకారానికి నిదర్శనమని వీరన్న విమర్శించారు.జగన్ చరిష్మాను తగ్గించలేరు: జగన్ మోహన్ రెడ్డి పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణను ఇటువంటి రాతలు, మాటలతో తగ్గించలేరని ఆయన స్పష్టం చేశారు.పచ్చ మీడియా కేవలం ఒక వర్గానికి కొమ్ముకాస్తూ, ప్రతిపక్ష పార్టీని అప్రతిష్ట పాలు చేయడమే ధ్యేయంగా ఆంధ్రజ్యోతి వ్యవహరిస్తోందని ఆరోపించారు.రాధాకృష్ణ తన వైఖరిని మార్చుకోకపోతే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తగిన బుద్ధి చెబుతారని వీరన్న హెచ్చరించారు.అధికార మదంతో,పక్షపాత బుద్ధితో వ్యవహరిస్తున్న రాధాకృష్ణకు ప్రజలు ఇప్పటికే ఓసారి తీర్పు ఇచ్చారు. కార్యకర్తలను కించపరిస్తే సహించేది లేదు.

# సంపాదకీయం



## పేరు వస్తే కేజ్రీవాల్ చూడలేరా

ఆమ్ ఆద్మీ పార్టీలో ఎంతో కాలంగా కీలక వ్యూహకర్తగా, అరవింద్ కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా వ్యవహారం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ నాయకత్వానికి, చద్దాకు మధ్య గత కొన్నాళ్లుగా ముదురుతున్న విభేదాలు ఇప్పుడు బహిర్గతమయ్యాయి. ఆయనను రాజ్యసభలో పార్టీ ఉపనేత పదవి నుంచి తొలగించడమే కాకుండా, సభలో ఆయనకు మాట్లాడే అవకాశం ఇవ్వవద్దని పార్టీ ఏకంగా రాజ్యసభ సెక్రటేరియట్‌కు లేఖ రాయడం సంచలనం రేపుతోంది. ఇది ఆయనను ఉద్దేశపూర్వకంగానే పార్టీ దూరం పెడుతోందన్న వాదనలకు బలం చేకూరుస్తోంది.ఇలా ఆయనను పదవి నుంచి దింపేయడానికి, పార్టీ తరపున మాట్లాడకుండా చేయడానికి ఆయన ఆప్ గురించి వ్యతిరేకంగా మాట్లాడలేదు. బీజేపీని పొగడలేదు. చాలా సామాన్యుల అంశాలపై మాట్లాడారు. వాటికి మంచి రియాక్షన్ వచ్చింది. ఆయనకు కేజ్రీవాల్ కన్నా ఎక్కువ పేరు వస్తుందని అనుకున్నారేమో కానీ.. దూరం పెట్టేశారు. రాఘవ్ చద్దా కేవలం సాఫ్ట్ పీఆర్ కే పరిమితం అవుతున్నారని, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా మాట్లాడటం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ముఖ్యంగా పంజాబ్‌కు సంబంధించిన కీలక సమస్యలను ఆయన సభలో ప్రస్తావించడం లేదని సీఎం భగవంత్ మాన్ వంటి నేతలు విమర్శించారు. దీనిపై చద్దా స్పందిస్తూ.. తాను సభకు వెళ్లేది గందరగోళం సృష్టించడానికి కాదని, ప్రజా సమస్యలపై ప్రభావవంతంగా మాట్లాడటానికని గట్టిగా బదులిచ్చారు.. ముఖ్యంగా వివిధ కంపెనీలు నెల రీఛార్జి పేరుతో 28రోజుల కాలపరిమితి నే నెలగా పేర్కొన్నారని రాజ్యసభలో ఎండగట్టారు.వందల కోట్ల రూపాయల రీచార్జ్ కుంభకోణం బయట పెట్టడమే కాక,చట్టసభల ప్రజాప్రతినిధులు నెలకుకేవలం300 రూపాయల రీచార్జ్ నెలకు అపరిమిత వాడకంకు సరిపోతుండగా వాళ్ళకు పది వేల రూపాయలు ఫోన్ చార్జీల క్రింద చెల్లించడం ఎందుకు?ఇది ప్రజల సొమ్ము దుర్వినియోగం కాదా? అని ప్రశ్నించారు.ఇట్లాంటి సంచలనాత్మక విషయాలను ఆయన రాజ్యసభలో ప్రస్తావించడం ద్వారా దేశంలోని యువతలో విపరీతమైన క్రేజ్ వచ్చింది.మధ్యతరగతివర్గంతమకు ఓప్రాతినిధ్యం లభించింది అనిసంబరపడ్డారు.దీనితో చిర్రెత్తు కొచ్చిన కేజ్రీవాల్ ఆయన్ను రాజ్యసభ ఉపనాయకుడుగా తొలగించడంతో పాటు,ఆయనకు ప్రాదాన్యత ఇవ్వొద్దు అని రాయడం రాజ్యసభ చరిత్రలోనే సంచలనం కలిగించింది.

రేపు ఆయనను పార్టీ నుండి గెంటి వేయడం కూడా జరుగవచ్చును? ఏదిఎలా ఉన్నా మరోసారి అరవింద్ కేజ్రీవాల్ తన లోపలి మనిషిని బయట పెట్టుకొని, ప్రశ్నించే స్వభావాన్ని చంపి వేశాడని దేశ యువత భావిస్తుంది.ఇలా ప్రశ్నించే స్వభావాలు గొంతు నులపడం ఒక్క రాఘవచెద్దాతో మొదలు కాలేదు.డిల్లీ ఎన్నికల ముందు మరో రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలైవాల్ ని పార్టీ నుండి సాగనంపారు. అంతకుముందు ఆమ్ఆద్మీ పార్టీ పెట్టిన తొలినాళ్ళలో యోగేంద్ర యాదవ్, కిరణ్ బేడీ లాంటి ప్రశ్నించే మేదావులను పొమ్మనకుండానే పొగ పెట్టారు. ప్రత్యర్థులపై ప్రశ్నలు వర్షం కురిపించే కేజ్రీవాల్ విచిత్రంగా తమపార్టీ నేతలు ప్రశ్నలు,ఎదుగుదలను సహించలేక పోవడం అనేది ఆయనకు ఆకస్మికంగా వచ్చిన మార్పు కాదు.ఆయనలో దీర్ఘకాలికంగా ఉన్న జబ్బునే? అవినీతి వ్యతిరేక ఉద్యమం ద్వారా వచ్చిన క్రేజ్ ను వాడుకొని అధికారం లోకి వచ్చిన కేజ్రీవాల్ ఆమ్ఆద్మీపార్టీ ని ఓప్రజాస్వామ్య పార్టీగా మలచడం లో విఫలం అయ్యాడు. ఆమ్ఆద్మీపార్టీ కి ఒక రాజకీయ విధానంకానీ , నిర్మాణం కానీ లేదు.వ్యక్తిపూజను అధికారిక ఎజెండాగా చేసిన పార్టీలలో జాబితాలో ఆమ్ఆద్మీపార్టీ ఏనాడో చేరిపోయింది.అంతేకాదు ఆపార్టీకి ఏకైక ఏజెండా కేజ్రీవాల్ తప్ప ఒక నిర్దిష్ట రాజకీయ విధానం కానీ, సిద్ధాంతం కానీ లేదు,కనీస ప్రజాస్వామ్య నిర్మాణం గానీ లేదు.ఆమ్ఆద్మీపార్టీలో సంస్థాగత సమావేశాలు, ఎన్నికలకు ఆవగింజంత చోటు గానీ,కార్యకర్తలు అభిప్రాయాలను గౌరవించడంఅనే అనవాయితీ లేదు. ఒక ఆర్థిక, రాజకీయ ఎజెండా స్పష్టత కూడా ఇంతవరకు లేదు.జాతీయ పార్టీగా గుర్తింపు పొందిన తర్వాత కూడా ఆమ్ఆద్మీపార్టీ విధానాల్లో మార్పులేదు. ఆప్ జెండా విషయంలో అదే గందరగోళం నెలకొంది. మొదట తెల్లజెండా, తర్వాతపసుపు పచ్చజెండా, తర్వాత పచ్చజెండా క్రింద బులుగు రంగు.ఇక రాజకీయ పరమైన విధానాల్లో కూడా అంతే.ఒకవైపు భగత్ సింగ్, అంబేద్కర్ బొమ్మలు కుడి,ఎడమలో పెట్టు కుంటారు.మరోవైపు వంద రూపాయల నోటు మీద సరస్వతి, లక్ష్మీదేవి, వినాయకుడు బొమ్మలు ముద్రించాలని బిజెపిని డిమాండ్ చేస్తాడు.ప్రాంతీయ పార్టీలకు మద్దతు కూడగట్టి ప్రధాని కావాలనే ఆలోచనతోనే చంద్రబాబు నాయుడు, కేసీఆర్,శివసేన, మమతా బెనర్జీ, తదితరులతో జట్టు కట్టే ప్రయత్నం చేశారు. మరిన్ని కనుగొనండి ఆన్‌లైన్ వార్తలు రాష్ట్ర వార్తలు తక్షణ అప్‌డేట్‌లు చివరకు ఇండియా కూటమిలో చేరి పోటీ చేసినా కనీసం తాము అధికారం లో ఉన్న డిల్లీ లో ఒక్క స్థానం గెలవకపోగా పంజాబ్ లోకూడా చావుతప్పి కన్నులొట్టపోయి మూడు స్థానాల్లో మాత్రమే విజయం సాధించాడు.అటుతర్వాత ఆయన సొంత రాష్ట్రం హర్యానా లో జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమిలో ఉండి స్వతంత్రం గా పోటీ చేయడంవలన కాంగ్రెస్ ఓటమికి నాంది పలికాడు. కేజ్రీవాల్ స్వయం కృత రాజకీయ అపరాదాలే తప్ప ఆమ్ఆద్మీపార్టీ ఓటమి కాదు.ఒకవైపు బిజెపి కాంగ్రెస్ బిటీం అని,మరోవైపు కాంగ్రెస్, బిజెపి బీటీం అని ప్రచారం చేస్తుంటే,కాదు నాది స్వతంత్ర టీం అని చెప్పుకోలేని రాజకీయ సందిగ్ధ,అసంబద్ధ స్థితిలో ప్రస్తుతం కేజ్రీవాల్ ఉన్నారు.వచ్చిన అధికారం, అవకాశాలు జాతీయ స్థాయిలో నిలుపుకునే నిర్మాణం గానీ, ప్రజాస్వామ్య విధానం కానీ ఆయనలో కనిపించదు.అనుభవం నుండి నేర్చుకున్నది లేదు.




## కార్పొరేట్ ఎగవేతదారుల
# కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం

ప్రజాస్వామ్యంలో చట్టం ముందు అందరూ సమానమనే సూత్రం కీలకం. అయితే శక్తివంతమైన కార్పొరేట్ సంస్థలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారనే భావన కలగడం ఆందోళన కలిగించే విషయం. అదానీ గ్రూప్, రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూప్ వంటి సంస్థలపై జరుగుతున్న విచారణలు ఆలస్యం అవుతున్నాయా, బలహీనపరచబడుతున్నాయా లేదా ఎంపిక చేసుకుని కొనసాగుతున్నాయా అన్న ఆరోపణలు దేశంలో క్రోనీ క్యాపిటలిజం పై మళ్లీ చర్చకు దారి తీశాయి. ఇది ఒక్కో సంఘటనకు మాత్రమే పరిమితం కాదు. ప్రభావశీల సంస్థలపై చర్యలు తీసుకోవడంలో నియంత్రణ సంస్థలు వెనుకంజ వేస్తున్నాయనే పెద్ద సమస్యను ఇది ప్రతిబింబిస్తోంది. సీబీఐ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ వంటి సంస్థలు వేల కోట్ల రూపాయల ఆర్థిక అక్రమాలపై దర్యాప్తు చేస్తున్నప్పటికీ, బాధ్యత నిర్ణయించే ప్రక్రియ మందగమనంలో ఉన్నట్టు కనిపిస్తోంది. దీనికి ఉదాహరణగా దాదాపు ?73,000 కోట్ల బ్యాంకు రుణ మోసాలపై రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూప్‌పై జరుగుతున్న విచారణ నిలుస్తోంది. దేశ అత్యున్నత న్యాయస్థానం ముందు సమర్పించిన నివేదికల ప్రకారం, అనేక కేసుల్లో నిధుల మళ్లింపు, దివాలా ప్రక్రియల్లో అక్రమాలు వంటి అంశాలు పరిశీలనలో ఉన్నాయి. వేల కోట్ల క్లెయిమ్‌లను చాలా తక్కువ మొత్తాలకు సెటిల్ చేసినట్లు ఈడీ పేర్కొనడం కూడా ఆందోళన కలిగిస్తోంది.ఈ కేసులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణ చేయడం వాటి తీవ్రతను చూపుతుంది. అయితే విచారణ సంస్థలు తమ విధులను స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి న్యాయస్థానం జోక్యం అవసరమవడం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. విమర్శకుల అభిప్రాయం ప్రకారం, రాజకీయ అధికారంతో కార్పొరేట్ ప్రభావం కలిసిపోవడం వల్ల అసమాన పరిస్థితులు ఏర్పడ్డాయి. శక్తివంతులకు నిబంధనలు సడలింపుగా, సాధారణులకు కఠినంగా అమలవుతున్నాయనే భావన పెరుగుతోంది. విచారణల్లో ఆలస్యం, పారదర్శకత లోపం, తక్షణ చర్యల కొరత ఇవి ఈ అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి. 24 జనవరి 2023న, “షార్ట్-సెల్లింగ్”లో ప్రత్యేకత కలిగిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ కంపెనీ షేరు ధర పడిపోతుందనే అంచనాతో దాని ధరపై పందెం వేయడం - అదానీ గ్రూప్ అకౌంటింగ్ అక్రమాలు, స్టాక్ మానిప్యులేషన్, షేర్ ధరలను పెంచడానికి ఆఫ్‌షోర్ షెల్ కంపెనీలను ఉపయోగించిందని ఆరోపిస్తూ 106 పేజీల నివేదికను ప్రచురించింది. గత వారం ఈ ఆరోపణలలో కొన్నింటిని సెబీ తోసిపుచ్చింది, దాని నిబంధనల ప్రకారం, అదానీ కంపెనీలు, సంబంధిత పార్టీల మధ్య ఎటువంటి లావాదేవీలు జరగలేదు. అందువల్ల, పెట్టుబడిదారులకు బహిర్గతం చేయవలసిన అవసరం లేదు, అవి మార్కెట్ మానిప్యులేషన్‌కు కారణమని పేర్కొంది. డబ్బులు దారి మళ్లించినట్లు లేదా నిధులను మళ్లించినట్లు లేదా




పెట్టుబడిదారులు డబ్బును కోల్పోయినట్లు ఎటువంటి ఆరోపణలు లేవని కూడా సెబీ పేర్కొంది. అదానీ కంపెనీలు ఏదైనా సంస్థ నుండి తీసుకున్న రుణాలను దర్యాప్తు ప్రారంభానికి ముందే తిరిగి చెల్లించారని కూడా సెబీ పేర్కొంది. యోగ్యత ఆధారంగా, నిందించబడిన లావాదేవీలను తారుమారు లేదా మోసపూరిత లావాదేవీలు లేదా అన్యాయమైన వాణిజ్య పద్ధతులుగా వర్గీకరించలేమని కూడా నిర్ధారించబడింది. రాయిటర్స్ వార్తా సంస్థ ప్రకారం, సెబీ అదానీ సంస్థలపై రెండు అభియోగాలను తొలగించింది, కానీ ఇన్‌సైడర్ ట్రేడింగ్ నుండి పబ్లిక్ ఫ్లోట్ ఉల్లంఘనల వరకు 22 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు క్రమంలో దేశంలో కార్పొరేట్లు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకుల మధ్య బలమైన బంధం ఏర్పడింది. ఆ బంధం గత పన్నెండేళ్ళు నరేంద్ర మోడీ పాలనలో మరింత బలపడింది. అందుకే ఈ మూడు తరగతులకు చెందినవారు ఒకరినొకరు సమర్ధించుకోవడం రివాజుగా మారింది.

అదాని గ్రూప్‌పై దేశీయంగా అంతర్జాతీయంగా పలు కీలక చట్టపరమైన మరియు నియంత్రణ సమస్యలను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా అమెరికా మరియు భారతదేశంలో కొనసాగుతున్న కేసులు లంచాలు, ఆర్థిక అక్రమాలు, పెద్ద కార్పొరేట్ కొనుగోళ్లకు సంబంధించినవిగా ఉన్నాయి. 2024 నవంబరులో అమెరికా ఫెడరల్ ప్రాసిక్యూటర్లు గౌతమ్ అదానీ సాగర్ అదానీ ఇతరులపై కేసు నమోదు చేశారు. భారత ప్రభుత్వ అధికారులకు వి250 మిలియన్లకు పైగా లంచాలు ఇచ్చి సౌర విద్యుత్ ప్రాజెక్టులను పొందేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. 2026 మార్చి నాటికి ఈ కేసు విచారణలో ఉంది. నిందితులకు సమన్లు అందించడంలో ఆలస్యం జరుగుతోందని అమెరికా అధికారులు పేర్కొంటూ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నోటీసులు పంపించే ప్రయత్నం చేస్తున్నారు. గౌతమ్ అదాని ఈ సివిల్ కేసులో నోటీసులు స్వీకరించడానికి అంగీకరించి, నిర్ణీత కాల వ్యవధిలో స్పందించాల్సి ఉంది. ఈ కేసు అంతర్జాతీయంగా ప్రభావం చూపింది. కొన్ని విదేశీ ప్రాజెక్టులు రద్దయ్యాయి, రేటింగ్ సంస్థలు కొన్ని కంపెనీలపై “నెగటివ్” అవుట్‌లుక్ ప్రకటించాయి, అలాగే గ్లోబల్ బ్యాంకులు కొత్త రుణాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి.బాంబే హైకోర్టు తీర్పు అదాని గ్రీన్ ఎనర్జీపై సీబీఐ దర్యాప్తు కోరిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ పిటిషన్ విదేశీ ఆరోపణలపై ఆధారపడి ఉందని, దేశీయంగా సరైన ఆధారాలు లేవని పేర్కొంటూ దీనిని “దుర్వినియోగం”గా అభివర్ణించింది.

ఇది సీబీఐ దర్యాప్తు డిమాండ్‌కు పెద్ద ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు. జేపీ అసోసియేట్స్ కొనుగోలు కేసు, అదాని ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ జేపీ అసోసియేట్స్ లిమిటెడ్ ను ?14,535 కోట్లకు కొనుగోలు చేయడానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ అనుమతి పొందింది. అయితే వేదాంత లిమిటెడ్ ఈ ఒప్పందాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టు ను ఆశ్రయించింది. కర్ణాటకలో ఏసీసీ లిమిటెడ్‌కు సంబంధించిన ?850 కోట్ల బకాయిలపై వివాదం కొనసాగుతోంది. అలాగే బీహార్‌లో అదాని పవర్ ప్రాజెక్టుపై వ్యతిరేక వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇవి ఇంకా పరిష్కారం కాలేని అంశాలుగా ఉన్నాయి.ప్రభుత్వం తరఫున వాదించే వారు పెద్ద కార్పొరేట్ సంస్థలు ఆర్థికాభివృద్ధికి, మౌలిక సదుపాయాల నిర్మాణానికి, ప్రపంచ పోటీతత్వానికి అవసరమని చెబుతారు. ఈ వాదనలో ఏమాత్రం నిజం లేదు,, అది బాధ్యత నుంచి మినహాయింపుకు కారణం కావద్దు. ఆర్థిక అభివృద్ధి, నైతిక పరిపాలన కలిసి నడవాల్సిందే.

**- డా. ముచ్చుకోట సురేష్ బాబు,**
**9989988912**

## డ్రగ్ రహిత సమాజం కోసం
# ‘దండి మార్చ్ 2.0’ సైకిల్ యాత్ర

**- పెళ్లకూరు మండలంలో యాత్రకు పోలీసు అధికారుల ఘన స్వాగతం**
**- అవగాహన సందేశాలతో ముందుకు సాగిన బృందం**



**పెళ్లకూరు - సూర్య వాస్తవం :** మాదకద్రవ్యాల వినియోగాన్ని నిర్మూలించి సమాజాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చేపట్టిన ‘డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ మిషన్’ లో భాగంగా నిర్వహిస్తున్న లి‘దండి మార్చ్ 2.0’లి సైకిల్ యాత్ర మంగళవారం పెళ్లకూరు మండల పరిధిలోకి ప్రవేశించింది. తిరుపతి నగరం నుండి విశాఖపట్నం వరకు సుమారు 1000 కిలోమీటర్ల దూరం సైకిల్ యాత్రగా కొనసాగుతున్న ఈ అవగాహన కార్యక్రమానికి స్థానిక పోలీసు అధికారులు స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు.

తిరుపతి నుండి ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర జాతీయ రహదారి 71 మార్గంగా మంగళవారం పెళ్లకూరు మండలం నెల్లబల్లి వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు, రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ దారం ఆదిలక్ష్మి యాత్రికులకు స్వాగతం పలికారు. అనంతరం పోలీసు అధికారులు కూడా కొంతదూరం సైకిల్ తొక్కుతూ యాత్రకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తుల జీవి తాలను మాత్రమే కాకుండా సమాజాన్నే ప్రమాదంలోకి నెడుతోందని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు బానిసైన వారు తమ భవిష్యత్తును నాశనం చేసుకోవడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నారని అన్నారు. అందువల్ల డ్రగ్ రహిత రాష్ట్రం సాధించాలంటే ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.డ్రగ్స్ సరఫరా మరియు వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజల సహకారం అత్యంత ముఖ్యమని అధికారులు సూచించారు. మాదకద్రవ్యాల గురించి ఎక్కడైనా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. వ్యసనాలకు బానిసైన యువతను బయటకు తీసుకువచ్చి సమాజంలో చైతన్యం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.ఈ సైకిల్ యాత్ర ద్వారా యువతలో మాదకద్రవ్యాల ప్రమాదాలపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. సమాజ శ్రేయస్సే తమ లక్ష్యమని, డ్రగ్ రహిత రాష్ట్రం నిర్మాణం కోసం ప్రజలంతా చేయి చేయి కలపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సైకిల్ యాత్ర బృంద సభ్యులు, స్థానిక యువత తదితరులు పాల్గొని యాత్రకు సంఘీభావం ప్రకటించారు.

# ముఖ్యమంత్రి గారూ! రాష్ట్రాన్ని గంజాయి,
# మురికి ఆంధ్ర ప్రదేశ్‌గా చేయకండి

**- ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించి వెంటనే ఆరోగ్యశ్రీ సేవలు పునరుద్ధరించాలి**
**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్ర ప్రదేశ్‌గా, మురికి ఆంధ్ర ప్రదేశ్ గా చేయవద్దని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి సూచించారు. మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఒకవైపు ముఖ్యమంత్రి గారేమో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, సంపద ఆంధ్ర, సంతోష ఆంధ్ర అంటూ రోజూ పాట పాడుతున్నారు . మరొక వైపేమో రాష్ట్రం మధ్య ఆంధ్ర, జూదాంధ్ర, గంజాయ్ ఆంధ్ర, డ్రగ్గాంధ్ర,మురికాంధ్ర, బూతుల ఆంధ్ర, దరిద్రపు ఆంధ్రగా తయారవుతోందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. మండలానికి నాలుగు మద్యం షాపులు, 40 బెల్ట్ షాపులుగా మద్యం పాలసీ తయారైంది. మద్యం విచ్చలవిడిగా దొరుకుతోంది .ఏరులై పారుతోంది. ఇంటికి ఒక పారిశ్రామికవేత్త దేవుడెరుగు. ఇంటికొక తాగుబోతు తయారవుతున్నాడు. మద్యానికి బానిసలైన మహిళల సంఖ్య రోజురోజుకు పెరుగు తోంది. మూడు జోకర్లు,ఆరు కళావరులుగా జూదం సాగుతోంది . హై స్కూల్ విద్యార్థుల్లో కూడా డ్రగ్స్, గంజాయి దుష్ట సంస్కృతి రోజురోజుకు ఎక్కువవుతోంది. కడపకు చెందిన గంజాయి బ్యాచ్ కడప శివారులోని అలంకానిపల్లికి చెందిన పెద్ద దస్తగిరిని కడప రిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో కత్తులతో పొడిచి సోమవారం తెల్లవారుజామున దారుణంగా చంపారు. రాష్ట్రంలో పారిశుధ్యం పడకేసింది. మురుగు కాలువలు పూడిపోయాయి. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఎక్కడ చూసినా దుర్గంధం. ముక్కు మూసుకుని రోడ్ల పైన నడవాల్సి వస్తోంది. దోమలు, పందులు, కుక్కలు, ప్రజలు సహజీవనం చేస్తున్నారు మలేరియా,డెంగు,టైఫాయిడ్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. నెలలో ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం మొక్కుబడిగా, తూతూ మంత్రంగా చేస్తోంది. ఈరోజు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం. 1950 సంవత్సరం నుంచి ఏప్రిల్ ఏడవ తేదీని ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. మనుషులు, మొక్కలు, జంతువులు, భూగోళం ఆరోగ్య రక్షణ కోసం కలిసికట్టుగా కృషి చేద్దామని, విజ్ఞానానికి అండగా నిలబడదామని ప్రపంచ ఆరోగ్య సంస్థ 2026 సందేశాన్ని ఇచ్చింది. ఒకవైపు పారిశుధ్యం పడకేసిన కారణంగా అంటువ్యాలు విజృంభిస్తూ ఉంటే మరొకవైపు ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించని కారణంగా నెట్వర్క్ హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేసిన కారణంగా అనేకమంది మృత్యువాత పడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మాటలు కట్టిపెట్టి రాష్ట్రములో గంజాయి, డ్రగ్స్ అరికట్టేందుకు, పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు కృషి చేయాలని, 3,000 కోట్ల రూపాయలు ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే చెల్లించి నెట్వర్క్ హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలు వెంటనే పునరుద్ధరించాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# అనంతలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ భారీ ర్యాలీ



**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అనంతపురం నగర ప్రజలను చైతన్య పరుస్తూ భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో గల అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 7 గంటలకు నగరంలోని కృష్ణ కళా మందిరం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. సర్వజనాస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ ఎం. మల్లీశ్వరి, ఆర్ఎంఓ డాక్టర్ గుజ్జల హేమలత జెండా ఊపి ర్యాలీని లాంఛనంగా ప్రారం భించారు. బ్యానర్లు, ప్లకార్డులు చేతబట్టి టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్, జిల్లా పరిషత్ కార్యాలయం, తెలుగుతల్లి విగ్రహం మీదుగా ప్రభుత్వ సర్వజనాస్పత్రి వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి, ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ప్రాధాన్యాన్ని వివరించారు. ఆరోగ్యానికి సంబంధించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ నినాదాలు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీంతో ర్యాలీ ప్రశాంతంగా ముగిసింది. కార్యక్రమంలో సర్వజ నాస్పత్రి వైద్యులు డాక్టర్ హరిణి, డాక్టర్ రాధిక, డాక్టర్ శంకర్ నారాయణ, డాక్టర్ ప్రసూన, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్.డీ.ఎస్) సభ్యులు రత్నమయ్య. నర సింహులు, అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ స్టాఫ్ నర్సులు సునీత, మానస, బోయ సుకన్య, హైమావతి, రమాదేవి, పల్లవి, రాధ, ఎం.ఎన్.ఓలు వెంకటసాయి, వెంకట నారాయణ, సెక్యూరిటీ సిబ్బంది సుగుణ, శోభా, జుబేదా. లక్ష్మీప్రసన్న, శ్రీకాంత్, ప్రభు, నాగరాజు, అమర్నాథ్, ల్యాబ్ టెక్నీషియన్ కామేశ్, రేడియోగ్రాఫర్ నరసింహా, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, నిర్మల కాలేజ్ ఆఫ్ నర్సింగ్, శ్రీసాయి నర్సింగ్ కాలేజ్, ఆదర్శ నర్సింగ్ కాలేజ్, ఏఎన్ఎం, పీవీకేకే ఫార్మసీ, హోమియో ల్యాబ్ టెక్నిషి యన్లు, ఐఎంఏ, ఐఏపీ సభ్యులు పాల్గొన్నారు.

# దోమల నియంత్రణ మనందరి బాధ్యత

**- సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య**



**వేముల - సూర్య వాస్తవం:** వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భూమాయ్యగారిపల్లె గ్రామంలో మంగళవారం సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వ ర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వేను ముమ్మ రంగా నిర్వహించారు. వర్షాకాలం, మారుతున్న వాతా వరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడ కుండా ముందస్తు జాగ్రత్తగా ఈ కార్యక్రమం చేపట్టారు.

**క్షేత్రస్థాయిలో యాంటీ లార్వా ఆపరేషన్స్**

ఈ సందర్భంగా వైద్య బృందం ప్రతి ఇంటిని సందర్శించి నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. నీటి తొట్లు, టైర్లు, పాత సామాగ్రిలో దోమల లార్వా పెరగకుండా యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహించారు. నీటిని నిల్వ ఉంచుకోకూడదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

**ఆశా డే మీటింగ్ -- అవగాహన సదస్సు:**

అనంతరం వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన 'ఆశా డే' సమావేశానికి సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. దోమకాటు వల్ల వచ్చే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి ప్రమాదకర వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.



**ఫ్రైడే - డ్రైడే:** ప్రతి శుక్రవారం ఇంటి లోపల, బయట నీరు నిల్వ ఉన్న పాత్రలను ఖాళీ చేసి ఎండబెట్టడం ద్వారా దోమల ఉత్పత్తిని 100శాతం అరికట్టవచ్చని వివరించారు.

**వ్యక్తిగత జాగ్రత్తలు:** దోమ తెరలు వాడటం, ఒంటి నిండా బట్టలు ధరించడం వంటి జాగ్రత్తలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు.

**ఫీవర్ సర్వే:** జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరి వివరాలు సేకరించి, వెంటనే రక్త పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి ఉషా రాణి, హెల్త్ సూపర్ వైజర్ రమేష్,విజయలక్ష్మి, ఎం.ఎల్.హెచ్.పిలు/సి.హెచ్.ఓ లు, యం.పి.హెచ్.ఏ(యం). శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానవుని శరీరం ఒక దేవాలయం లాంటిది

**- ఫిజియోథెరఫి వైద్యులు యోగీశ్వర బాబు**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** మానవుని శరీరం ఒక దేవాలయం లాంటిదని, దానిని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవడం మానవుని కనీస బాధ్యతని ఫిజియోథెరఫి వైద్యులు యోగీశ్వర బాబు తెలిపారు. మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా పులివెందుల రోడ్డు నందు గల శ్రీ హరి ఫిజియోథెరఫి వైద్యశాలలో రోగులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ యోగీశ్వర బాబు మాట్లాడుతూ, నేటి ఆధునిక జీవనశైలిలో శారీరక వ్యాయామం లేకపోవడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. రోజూ కనీసం అరగంట వ్యాయామం చేయడం, సరైన ఆహారం తీసుకోవడం, సమయానికి నిద్రపోవడం ఆరోగ్యానికి ఎంతో అవసరమని సూచించారు. అలాగే ఎక్కువసేపు ఒకే చోట కూర్చో వడం, మొబైల్ ఫోన్ల వినియోగం అధికం కావడం వల్ల నడుము,మెడ నొప్పులు పెరుగుతున్నాయని చెప్పారు. అలాంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఫిజియోథెరపీ ద్వారా శరీర నొప్పులు తగ్గించుకోవడంతో పాటు శరీర కదలికలను మెరుగుపరుచుకోవచ్చని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఫిజియోథెరఫి కీలక పాత్ర పోషిస్తుందని ఆయన వివరించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు.

# హైదరాబాద్ ఏబీఎన్ కార్యాలయంపై దాడి దుర్మార్గం..

**- తీవ్రంగా ఖండించిన బీటెక్ రవి**




**పులివెందుల - సూర్య వాస్తవం:** హైదరాబాద్‌లోని ఏబీఎన్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఏబీఎన్ ఆఫీసును స్వయంగా సందర్శించి అక్కడ జరిగిన విధ్వంసాన్ని పరిశీలించారు. దాడికి సంబంధించిన పూర్తి వివరాలను సంస్థ యాజమాన్యాన్ని, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికలు, ప్రసార మాధ్యమాలపై దాడులు చేయడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. నిజాన్ని నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకువస్తున్న ఆంధ్రజ్యోతి మీడియా గొంతు నొక్కాలని చూడటం, భౌతిక దాడులకు పాల్పడటం దుర్మార్గం అని పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛపై జరిగిన ఈ దాడిని తీవ్రంగా పరిగణించాలని, దాడికి పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.?ఈ సమయంలో ఏబీఎన్ సంస్థకు, యాజమాన్యానికి, మరియు మనోధైర్యంతో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఆయన తన ప్రగాఢ సంఘీభావం తెలియజేశారు. భవిష్యత్తులో మీడియా సంస్థలపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన భద్రత కల్పించాలని, మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

# న్యూతన తహసీల్దార్‌కు ఘన సన్మానం



**వేంపల్లె - సూర్య వాస్తవం:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీ నేపథ్యంలో కడప జిల్లావేంపలే తహసీల్దార్ కార్యాలయనికి బదిలీ పై నూతనంగా విచ్చేసిన తాసిల్దార్ మోహన్ కృష్ణకు ప్రజా సంకల్ప వేదిక రాజకీయ విభాగం కడప జిల్లా వైస్ ప్రెసిడెంట్ కే గంగయ్య, వేంపల్లి మండల ప్రెసిడెంట్ చిన్న ఓబులేష్, తహసిల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను పూలమాల,శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు వేంపలే మండలంలో ఉన్న ప్రజల భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని మండల ప్రజలందరికీ సమానంగా న్యాయాన్ని చేకూర్చాలని ఆయనను వారు కోరగా వెంటనే ఆయన స్పందించి మండలంలో ఉన్న భూ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని, మండల తాసిల్దార్ మోహనకృష్ణ భరోసా కల్పించాలని జిల్లా వైస్ ప్రెసిడెంట్ కే. గంగయ్య, వేంపల్లి మండలం ప్రెసిడెంట్ చిన్న ఓబులేష్ తెలియజేశారు.

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం
### - తాళ్లపల్లి పిహెచ్సిలో అవగాహన



**వేంపల్లె - సూర్య వాస్తవం:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని తాళ్లపల్లి పిహెచ్సి వైద్యులు డా.శాంతి సుశేన్, డా.పృధ్వీకుమార్ రెడ్డి లు ఘనంగా నిర్వహించారు. మంగళవారం తాళ్లపల్లి పిహెచ్సి సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ మానవ శరీరం ఒక దేవాలయం వంటిదని, దీనిని పరిశుభ్రం, ఆరోగ్యంగా ఉంచాలని కోరారు. మనిషికి ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, యోగా, ధ్యానంతో పాటు వ్యాయామం చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ వెంకటరత్నం, హెచ్ఇ రెడ్డికుమారి, సూపర్వైజర్లు అరుణాదేవి, అంకయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయానికి సహకరించండి

**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ జగదీశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు సదాశివారెడ్డి హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నందున ఈ విద్యుత్ నిలిపివేత ఉంటుందని ఆయన పేర్కొన్నారు.పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈఈ జగదీశ్వర్ రెడ్డి కోరారు.

## కనేకల్‌లో దున్నపోతుల దూలం లాగుడు పోటీలు



**కనేకల్ - సూర్య వాస్తవం:** గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే భాగంగా కనేకల్ గ్రామ పంచాయితీ పరిధిలో దున్నపోతుల దూలం లాగుడుపోటీలను నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు.ఏప్రిల్ 9, 2026న ఉదయం 7 గంటల నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ పోటీలు జరుగనున్నాయని ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన ఆసక్తిగల వ్యక్తులు అదే రోజు ఉదయం 7 గంటలకు వేదిక వద్ద తమపేర్లను నమోదుచేసుకోవాలనిసూచించారు. గ్రామీణ సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విస్తృత స్పందన లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## జెఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ యమునకు డాక్టరేట్ ప్రదానం



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగంలో సహాయ అధ్యాపకు రాలు (అసిస్టెంట్ ప్రొఫెసర్)గా పనిచేస్తున్న పగిడేల యమునకు జెఎన్‌టీయూ అనంత పురం విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటిం చింది.ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. విష్ణువర్ధన్ ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు.పగిడేల యమున తన పరిశోధనను జెఎన్‌టీయూ అనంతపురం ఈఈఈ విభాగంలో పెర్ఫార్మన్స్ ఎంహాన్స్మెం ట్ ఇన్ హైబ్రిడ్ ఏసీ/డీసీ మైక్రోగ్రిడ్ విత్ ఈఎస్ఎస్ యూసింగ్ ఏఎన్ఎన్ కంట్రోలర్ అనే అంశంపై డాక్టర్ ఎన్.విశాలి పర్యవేక్షణలో పూర్తి చేశారు.?అత్యుత్తమ పరిశోధనతో డాక్టరేట్ సాధించిన పగిడేల యమునను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. విష్ణువర్ధన్,వైస్ ప్రిన్సిపాల్,తోటి అధ్యాపకులు మరియు సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.ఆమె సాధించిన ఈ విజయం కళాశాలకు మరియు విద్యార్థులకు గర్వకారణమని వారు పేర్కొన్నారు.

## గుత్తి మున్సిపల్ కార్యాలయంలో మెప్మా అధికారులు, ఆర్‌పిలతో ప్రత్యేక సమావేశం

**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి మున్సిపాలిటీ పరిధిలో మెప్మా కార్యక్రమాలపై సందర్శ న చేసిన స్టే ట్ మిషన్ మేనేజర్ ఆదినారాయణ, అనంతపురం పి.డి విశ్వజ్యోతి ఈ సందర్భంగా మున్సిపల్ ఆఫీసు యందు మెప్మా అధికారులు,మెప్మా ఆ ర్.పిలతో ప్రత్యేక సమావేశం ఏ ర్పాటు చేశారు.అందులో భాగంగా మొబైల్ బుక్ కీపింగ్, మహిళా ఆకా శం యాప్ ద్వారా సంఘాల నిర్వ హణ,మహిళా సంఘాల బలోపేతం మహిళలు సామాజికంగా ఎదుగుద లకుతోడ్పాటు కోసం మెప్మా సిబ్బం ది.వారు సేవా భావంతో పనిచేయా లని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఐ.బి భవాని, టి.యం.సిలు శ్రీనివాస రెడ్డి,చంద్రశేఖర్,సి.ఓ షరీఫ్,మెప్మా ఆర్.పి లు పాల్గొన్నారు.

## రీ-సర్వేను తనిఖీ చేసిన తహాశీల్దార్



**గాండ్లపెంట - సూర్య వాస్తవం**
మండలంలోని కటారుపల్లి, మల్లిమీదపల్లి గ్రామాల్లో జరుగు తున్న రీ-సర్వే పనులను తహసిల్దార్ బాబురావు తనిఖీ చేశారు. ఈ రీ-సర్వే కార్యక్రమం లో భాగంగా ఆయన సర్వే జరుగుతున్న ప్రదేశాలను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించడం రీ-సర్వే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి సందేహాలు లేదా సమస్యలు ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. అలాగే సర్వే పనులు పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో లు రామ్మోహన , చంద్రశేఖర్ ,విలేజ్ సర్వేర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### మహిళలపై జరిగే నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టండి

# జీరో టాలరెన్స్ విధానం అమలు చేయండి

### జిల్లా ఎస్పీ పి. జగదీష్





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లాలో మహి ళలపై జరుగుతున్న నేరాల( క్రైం అగనెస్ట్ ఉమెన్ ) ను పూర్తిగా నియంత్రించేందుకు ప్రాధాన్యతగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మహిళల భద్రతను అత్యంత ముఖ్యమైన అంశంగా పరిగణిస్తూ, అన్ని స్థాయిల్లో కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఎస్పీ ప్రధాన ఆదేశాలు :**

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేయాలని మహిళలపై వేధింపులు, గృహ హింస, లైంగిక వేధింపులు, దాడులు వంటి నేరాలపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలన్నరు.నమోదైన కేసులను వేగంగా విచారణ చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు త్వరితగతిన చేపట్టాలని శక్తి టీమ్స్" కార్యకలాపాలను విస్తరించి, పబ్లిక్ ప్రదేశాలు, విద్యాసంస్థలు, కార్యాలయాల వద్ద గస్తీ పెంచాలన్నరు

**ప్రత్యేక చర్యలు :**

మహిళల కోసం 24/7 హెల్ప్‌లైన్ సేవలను బలోపేతం చేసి, వచ్చిన ఫిర్యాదులను తక్షణమే స్పందించి సోషల్ మీడియా మరియు ఆన్‌లైన్ వేధింపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నరు.పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,



మహిళల హక్కులు మరియు భద్రతపై చైతన్యం కల్పించాలని తెలిపారు.పునరావృత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచి, అవసరమైతే బైండోవర్ చర్యలు చేపట్టాలని సూచించారు.

**పోలీసు సిబ్బందికి సూచనలు**

మహిళా ఫిర్యాదుదారుల పట్ల సున్నితంగా, గౌరవంగా వ్యవహరించాలని ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకుని, ఆలస్యం లేకుండా నమోదు చేయాలన్నరు.మహిళా పోలీస్ సిబ్బంది భాగస్వామ్యాన్ని పెంచి, బాధితులకు సహాయక వాతావరణం కల్పించాలన్నరు

**జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి :** అనంతపురం జిల్లా ప్రజలు, ముఖ్యంగా మహిళలు, ఎటువంటి భయం లేకుండా తమ సమస్యలను సమీప పోలీస్ స్టేషన్ లేదా హెల్ప్‌లైన్ ద్వారా తెలియజేయాలని ఎస్పీ కోరారు. నేరాల నివారణలో ప్రజల సహకారం అత్యంత కీలకమని తెలిపారు.మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రతి కేసును సీరియస్‌గా తీసుకుని న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ గారు తెలియజేశారు. శక్తి యాప్ సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఆంధ్రజ్యోతి కార్యాలయం పై దాడి హేయమైన చర్య

### బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



**వేంపల్లె - సూర్య వాస్తవం:** హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని భా.జ.పాజిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ శ్రేణుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాని చెప్పారు . అమరావతిపై తమ అరాచక వైఖరిని ప్రశ్నించినందుకు మీడియా గొంతు నొక్కాలనుకోవడం పిరికిపంద చర్యఅని అన్నారు.రౌడీ మూకలను వెంటేసుకుని వైసీపీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఒక మీడియా సంస్థపైకి వెళ్లడం వారి 'విష సంస్కృతి'కి పరాకాష్ట అని చెప్పారు.ఐదేళ్ల పాటు అధికార బలంతో వేధించినా లొంగని ఆంధ్రజ్యోతిని, ఇప్పుడు దాడులతో భయపెట్టాలని చూడటం మీ అవివేకంఅని అన్నారు.ఇది ముమ్మాటికీ మీడియా స్వేచ్ఛపై దాడి. సొంతగా మీడియా సంస్థలను నడుపుతూ.. మీడియాను అడ్డుపెట్టుకుని అనైతిక చర్యలకు పాల్పడుతున్న వైసీపీ.. తమను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతిపై దాడులు చేయడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. ప్రశ్నిస్తే దాడులు చేయడం కాదు.. చేతనైతే ప్రజాక్షేత్రంలో సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంపై ఇలాంటి దాడులు సాగనివ్వబోం. దాడులు, బెదిరింపులతో మీడియాను భయపెట్టాలనే వైసీపీ రాజకీయాలకు కాలం చెల్లిందని అన్నారు .రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన రాజధాని అంశంపై జగన్ వైఖరిని ప్రశ్నించినందుకు ఈ దాడికి పాల్పడటం హేయం. ధైర్యం ఉంటే వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాలి గానీ.. ఇలా దాడుల సంస్కృతిని ప్రోత్సహించడం గర్హనీయంఅని అన్నారు. ఇలాంటి ప్రవర్తన కారణంగానే 11 సీట్లకు పరిమితమయ్యారు. ఇంకా తీరు మార్చుకోకుంటే మీకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం - విద్యార్థి మృతి



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:**
హ్మంగారిమఠం మండలం తోట్లపల్లి గ్రామం వద్ద ఉన్న శ్రీ అచలానంద ఆశ్రమం వద్ద 33 లెవెన్ కేవీ విద్యుత్ వైర్ తక్కువ ఎత్తులో ఉన్న కారణంగా మృతి చెందిన కార్తీక్ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ మండల కమిటీ సభ్యులు సానా గోవింద స్వామి, రెబ్బ నరసింహలు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దు రాహుల్ బృందం సందర్శించి మృతదేహానికి నివాళి అర్పించి కార్తీక్ తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి వారికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి,శివకుమార్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా, దర్శి మండలం బోట్లపాలెం గ్రామానికి చెందిన కార్తీక్ అనే విద్యార్థి అచలానంద ఆశ్రమంలో ఉంటూ బ్రహ్మంగారిమఠంలో ఉన్న దీప్తి ప్రైవేట్ హై స్కూల్ నందు 8వ తరగతి చదువుకుంటున్నాడని సోమవారం రాత్రి స్నానానికి వెళ్లిన కార్తీక్ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్రిందకు వేలాడుతున్న 33 లెవెన్ కె.వి వైర్లను తగులుకొని మరణించడం దురదృష్టకరమని భవిష్యత్తులో ఉన్నత చదువులు చదువుకొని తన కుటుంబానికి అండగా నిలవాల్సిన విద్యార్థి అధికారుల నిర్లక్ష్యానికి బలి కావడం బాధాకరమని వారి ఆందోళన వ్యక్తం చేశారు. పేదరికం కారణంగా అచలానంద ఆశ్రమంలో ఉంటూ అక్కడ సేవ చేస్తూ రాష్ట్రశీ లోని వివిధ ప్రాంతాలకు చెందిన 23 మంది విద్యార్థులు బ్రహ్మంగారిమఠంలో చదువుకుంటున్నారని వారి ఆలనా పాలన ఆశ్రమ నిర్వాహకులు చూస్తున్నారని వారు గుర్తు చేశారు. ఆశ్రమం దగ్గర ఏర్పాటు చేసిన కులాయి దగ్గర స్నానం చేసి వస్తానని వెళ్లిన కార్తీక్ కేవలం అధికారుల నిర్లక్ష్యం బాధ్యతారాహిత్యం కారణంగానే మరణించారని వారు ఆరోపించారు. ఆశ్రమ నిర్వాహకులు అనేకమార్లు సంబదిత విద్యుత్ ఏఈ గారి దృష్టికి తెచ్చిన సమస్యను పరిష్కరించకపోగా నిర్లక్ష్యంగా దాటవేశాడని ఆశ్రమంలో పనిచేస్తున్న పలువురు సిబ్బంది తెలిపారని వారన్నారు.

# ప్రగతికి నిలయం ప్రభుత్వ బడి

## -ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి -యుటియఫ్ పిలుపు

**పులివెందుల - సూర్య వాస్తవం:** విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలు ఆలంబనగా నిలుస్తున్నాయని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. మంగళ వారం సాయంత్రం యుటియఫ్ ప్రాంతీయ కన్వీనర్ కాయపాటి రామాంజనేయులు అధ్యక్షతన రమణప్ప సత్రం ప్రాథమిక పాఠశాల నందు 'ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం' ఊరి బడిని కాపాడు కుందాం' పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ అనంతరం విద్యా సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు సమృద్ధిగా ఉన్నాయని, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిరంతరం పర్యవేక్షణతో మంచి ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు పోటీపడుతూ విద్యను అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామాగ్రి,రుచికరమైన మధ్యాహ్న భోజనం, ఆధునిక పరిజ్ఞానం కలిగిన ఐఎఫ్ బి ప్యానెల్ బోర్డులు,ఎల్ఈడి టీవీల సహాయంతో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు.మన ఊరి బడిలో మన పిల్లలను చేర్పించకపోతే భవిష్యత్తులో



ఊరి బడి కనుమరుగయ్యే పరిస్థితి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వబడి ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపై ఉందని తెలిపారు. కార్పొరేట్ మోజులో పడి ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో పేద బడుగు,బలహీన వర్గాలకు విద్య దూరమయ్యే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాలు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు రామకృష్ణ, శారద ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డి, నాగిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గంగిరెడ్డి, బాబు రెడ్డి,సిఐటియు నాయకులు గఫూర్ యుటియఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు జిల్లా కార్యదర్శి సివి రమణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి నాయకులు శ్రీనివాసులు రెడ్డి,సూర రమేష్ బాబు,వెంకట కృష్ణ,బాబా ఫకృద్దీన్, ఆంజనేయులు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ కార్యకర్తలపై

# ఏబీఎన్ నీచమైన వ్యాఖ్యలు

- ఏబీఎన్ రాధాకృష్ణపై పులివెందుల పిఎస్‌లో ఫిర్యాదు
- కార్యకర్తల కుటుంబాలను కించపరుస్తారా
- వైసీపీ శ్రేణుల ఆగ్రహం



**పులివెందుల - సూర్య వాస్తవం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలపై అత్యంత అమానవీయమైన మరియు అసభ్యకరమైన వ్యాఖ్యలు ప్రసారం చేసిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పులివెందుల మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, పులివెందుల పట్టణ కన్వీనర్ గంగాధర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ కోడి రమణ , పులివెందుల పట్టణ ఉపాధ్యక్షుడు పా ర్ణపల్లి కిషోర్ ల ఆధ్వర్యంలో పులివెందుల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందించారు.ఈ మేరకు పులివెందుల వైఎస్సార్‌సీపీ శ్రేణులు మంగళవారం స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు రాతపూర్వక వినతిపత్రాన్ని సమర్పించారు. ?గత వారం శని,ఆదివారాల్లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి టీవీ మరియు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ప్రసారమైన ఒక కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఉద్దేశించి తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.పార్టీ నాయకుడు చెబితే కార్యకర్తలు తమ భార్యలను కూడా అక్కాచెల్లెళ్లుగా భావించి వేరే వాళ్లకు ఇచ్చి పెళ్లి చేస్తారు అనే అర్థం వచ్చేలా ప్రసారాలు చేయడంపై పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.?రాజకీయ విమర్శల పేరుతో కార్యకర్తల వ్యక్తిగత జీవితాలను,కుటుంబ గౌరవాన్ని బజారున పడేలా వ్యాఖ్యలు చేయడం మీడియా నైతికతకు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇటువంటి వ్యాఖ్యలు కార్యకర్తల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి,సమాజంలో శాంతిభద్రతల సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏబీఎన్ ఎండి వేమూరి రాధాకృష్ణతో పాటు ఇతర బాధ్యులపై ఐపీసీ సెక్షన్లు 499, 500 (పరువు నష్టం), 153ఎ (విద్వేషాల ప్రేరేపణ), 505(2) మరియు ఐటీ యాక్ట్ కింద ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు.?ఈ సందర్భంగా పులివెందుల పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో విమర్శలు ఉండవచ్చు కానీ,ఇళ్లలోని మహిళలను లాగుతూ నీచమైన వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం ఇది కేవలం ఒక పార్టీపై దాడి కాదు యావత్ మహిళా లోకాన్ని కించపరచడమే అని మండిపడ్డారు. తక్షణమే పోలీసులు స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో, మాజీ కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, మాజీ కౌన్సిలర్ ఖాదర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



# ప్రశ్నిస్తే దాడులా..?

## ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి యత్నం దుర్మార్గం

## : సుగవాసి ప్రసాద్ బాబు

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం**

హైదరాబాద్‌లోని ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడికి యత్నించడం తీవ్రంగా ఖండనీయమని రాజం పేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు అన్నారుఈ సందర్భంగా రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూవైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను మీడియా ప్రశ్నిస్తే దాడులకు దిగడం వైసీపీ రాక్షస స్వభావాన్ని బయటపెడుతోందని మండిపడ్డారుఅమరావతి రాజధాని విషయంలో వైసీపీ ప్రజలను మోసం చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి నుంచి వెనక్కి నెట్టారని, ఈ అంశంపై మీడియా నిజాలు బయటపెడితే వైసీపీ నేతలు జీర్ణించుకోలేక దౌర్జన్యానికి దిగుతున్నారని తెలిపారు.ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభమని, దాని గొంతు నొక్కే ప్రయత్నం చేయడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారుప్రశ్నలకు సమాధానం చెప్పలేని వైసీపీ నేతలు రౌడీ మూకలతో కలిసి దాడులకు దిగడం ప్రజాస్వామ్యంపై దాడితో సమానమని విమర్శించారు. వైసీపీకి ఉన్న రౌడీ సంస్కృతి ఈ ఘటనతో మరోసారి బట్టబయలైందని, తమ సొంత మీడియా ద్వారా ఇతరులపై ఆరోపణలు చేస్తూ... తమ తప్పులను ఎత్తిచూపిన వారిపై దాడులకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారుఈ ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తప్పు చేసినవారు చట్టం నుంచి ఎప్పటికీ తప్పించుకోలేరని హెచ్చరించారుఅలాగే మీడియా స్వేచ్ఛను కాపాడేందుకు టీడీపీ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వైసీపీ మూర్ఖత్వాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు

# చంద్రబాబు నాయుడు వల్లనే ఆంధ్ర రాష్ట్రం అవినీతిపాలైంది

### - మాజీ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్



**పులివెందుల అర్బన్ - సూర్య వాస్తవం:** దేశంలోనే అవినీతి రాష్ట్రం ఆంధ్ర రాష్ట్రమని, చంద్రబాబు నాయుడు పాలలోనే రాష్ట్రం అవినీతి పాలైందని మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కంచర్ల సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాధాకృష్ణపై ఆయన మండిపడ్డారు. చంద్రబాబు నాయుడుకు బినామీగా ఉంటూ చంద్రబాబు నాయుడు ఆడిస్తున్నట్లు రాధాకృష్ణ ఆడుతున్నారన్నారు. పచ్చ పత్రికలు అన్నీ కలిసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్న అన్నారు. అమరావతి పైన జరిగే అవినీతిపై నువ్వు ఎందుకు ప్రశ్నించలేక పోతున్నామని ఆయన అన్నారు. వైసీపీ కార్యకర్తలను నీకు నోటికి వచ్చినట్లు మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. వైఎస్ఆర్సిపి మహిళలపై ఆడి పోసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. రాధాకృష్ణ నీవు కూడా నీ కుటుంబం గురించి ఒక్కసారి పత్రికల్లో రాస్తే నీకే తెలుస్తుంది అన్నారు. నువ్వు రాసిన తప్పుడు రాతలకు వైకాపా మహిళలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ సుమతి



**గాండ్లపెంట - సూర్య వాస్తవం న్యూస్** మండలంలోని కదిరి-రాయచోటి ప్రధాన రహదారిపై మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను ఎస్ఐ సుమతి ఆధ్వర్యంలో పోలీసులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుమతి మాట్లాడుతూ, రహదారులపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనాలకు సంబంధిత పత్రాలు (డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్) సరిగా ఉండాలని, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని తెలిపారు.అధిక వేగంతో వాహనాలు నడపకూడదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం కఠినంగా నిషేధమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపయోగంగా చేతిపంపు బోర్లు



**కదిరి - సూర్య వాస్తవం:** పట్టణంలోని మున్సిపల్ పరిధిలో వివిధ వార్డులలో నిరుపయోగంగా ఉన్న చేతిపంపు బోరు లను మరమ్మత్తులు చేసి బోర్లు బిగించి నీటిని సరఫరా చేయాలని లిగ్నం ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ ధర్మవరం అల్తాఫ్ భాష మంగళవారం కదిరి మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ, వేసవి కాలంలో మంచినీటి సమస్యలతో వార్డుల్లోని ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, సమయానికి నీరు అందుబాటులో లేక చాలా దూర ప్రాంతాల నుండి నీటిని వాహనాల ద్వారా తెచ్చుకోవడం జరుగుతుందని తెలిపారు, అందువల్ల వార్డులోని బోర్లను మరమ్మత్తులను చేసి మోటార్లను బిగించి కదిరి ప్రాంతం నీటి సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని తెలిపారు , ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బాబూలాల్, సాదిక్ భాషా పాల్గొన్నారు

# చోరీ కేసులో బాలురు అరెస్ట్

### - వేంపల్లె సీఐ టి.నరసింహులు

**వేంపల్లె - సూర్య వాస్తవం:** గత పది రోజుల క్రితం స్థానిక శ్లోక పాఠశాల సమీపంలోని జమ్మిచెట్టు వద్ద జరిగిన చోరి కేసులో ఇద్దరు మైనర్ బాలురులను అరెస్ట్ చేసినట్లు వేంపల్లె సీఐ టి.నరసింహులు వివరాలు వెల్లడించారు. ఆ ఇద్దరు మైనర్ లను సోమవారం హనుమాన్ జంక్షన్ వద్ద అరెస్ట్ చేశామని, మంగళవారం జువెనైల్ హోమ్ కి తరలించామని తెలిపారు. అలాగే చోరీకి గురైన ఒక జత బంగారు కమ్మలు, వెండి గజ్జలు స్వాధీనం చేసుకుని, దొంగతనానికి ఉపయోగించిన ఇనుపకడ్డిని సీజ్ చేశామన్నారు. గత పది రోజుల క్రితం వరుస దొంగతనాల కేసులను ఛేజించి చెక్ పెట్టామని, ఏవరైనా అపరిచితులు వ్యక్తులు తమ పరిసర ప్రాంతాల్లో కనిపిస్తే పోలిసులకు సమాచారం అందించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

# నారా లోకేష్‌ను కలసిన టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి



**వేముల - సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపుమేరకు సోమవారం ఉండవల్లి లోని అయన నివాసంలో నారా లోకేష్ బాబు ని మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి కలవగా నారా లోకేష్ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ కి పులివెందుల ప్రాంతంలోని పలు సమస్యలను వివరించిన పార్థసారథి రెడ్డి త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు .అలాగే పార్టీ పరంగా పార్థసారది రెడ్డి కి సముచిత గౌరవం కల్పిస్తామని భరోసా ఇచ్చారు . పులివెందులలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని చెప్పారు.

# "ధురంధర్-2" చూశాను

## : సినిమాపై కింగ్ విరాట్ కోహ్లీ స్పందన






**క్రీడలు :** భారత్ క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ తాజాగా బ్లాక్‌బస్టర్ చిత్రం 'ధురందర్ 2' సినిమా చూశారు. తన అభిప్రాయాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. దర్శకుడు ఆదిత్య ధర్, కథానాయకుడు రణవీర్ సింగ్‌లను ప్రశంసిస్తూ ఇది తన జీవితంలోనే అత్యుత్తమ 'సినిమాటిక్ అనుభవం' అని విరాట్ తెలిపారు. భారత్ ఇలాంటి సినిమా అనుభవాన్ని తాను ఇంతకు ముందెన్నడూ చూడలేదని కొనియాడారు. దాదాపు 4 గంటల నిడివి ఉన్న ఈ చిత్రం ప్రతి క్షణం ఉత్కంఠభరితంగా సాగిందని, ఒక్క నిమిషం కూడా కళ్లు తిప్పుకోలేకపోయానని కోహ్లీ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పేర్కొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో 'ధురందర్ 2' పోస్టర్‌ను పోస్ట్ చేసిన విరాట్.. " ఈ రోజే సినిమా చూశాను. ఇలాంటి ఒక అద్భుతమైన సినిమా అనుభవం ఇండియాలో ఇంతకుముందెన్నడూ చూడలేదని కచ్చితంగా చెప్పగలను. దాదాపు 4 గంటలపాటు కనురెప్ప వేయకుండా చూశాను, నాలో ప్రతి భావోద్వేగాన్ని ఈ సినిమా తట్టిలేపింది. డైరెక్టర్ ఆదిత్యా ధర్ మీ ప్రతిభ, పట్టుదల మీరు సృష్టించిన ఈ అద్భుతంలో కనిపిస్తున్నాయి. మీకు నా హ్యాట్సాఫ్. మీరు ఒక జీనియస్. ఇక నటీనటులందరూ తమ పాత్రల్లో ఒదిగిపోయినప్పటికీ.. రణవీర్ ఈ సినిమా తర్వాత మీరు ఒక కొత్త శిఖరాన్ని చేరుకున్నారు. మీ నటన అద్భుతానికి మించి ఉంది. అబ్సల్యూట్లీ వావ్! " అని రాసుకొచ్చారు.

మరోవైపు. బాక్సాఫీస్ వద్ద కూడా 'ధురంధర్ 2' రికార్డుల వేట కొనసాగిస్తోంది. ఈ సినిమా ప్రయాణం ఆరంభం నుంచే ప్రభంజనం సృష్టించింది. జియో స్టూడియోస్ గణాంకాల ప్రకారం .... విడుదలైన రెండు వారాల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ.1622 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది.ఇందులో విదేశీ వసూళ్లు ఏప్రిల్ 6 నాటికి రూ.394 కోట్లుగా ఉండగా, దేశీయంగా రూ.1228 కోట్ల గ్రాస్ (రూ. 1041 కోట్ల నెట్) వసూళ్లను రాబట్టింది. 18వ రోజున కూడా భారతవ్యాప్తంగా 14,229 షోల ద్వారా రూ. 28.75 కోట్ల నెట్ వసూళ్లను సాధించి తన సత్తా చాటుతోంది.


# రేపు అల్లు అర్జున్ సినిమా ప్రకటన




'ఎఎ22ఎ6' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న అల్లు అర్జున్, అట్లీ సినిమా టైటిల్ ఈ రోజు ప్రకటించనున్నారు. పునర్జన్మల కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సైన్స్‌ఫిక్షన్ చిత్రంలో అల్లు అర్జున్ మూడు విభిన్న పాత్రలు పోషించబోతున్నట్లు సమాచారం. ఇందులో ముగ్గురు హీరోయిన్లు నటించబోన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దీపికా పదుకొణె పేరును ప్రకటించారు. జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్, రష్మికా మందన్నా, భాగ్యశ్రీ బోర్సే వంటి హీరోయిన్లు కూడా నటించనున్నారని వార్తలు వస్తున్నాయి. వచ్చే ఏడాది సమ్మర్‌లో ఈ చిత్రం విడుదల అయ్యే అవకాశం ఉంది.

## తమిళ 'కోర్ట్'లో

# దేవయాని కూతురు




తెలుగులో హర్ష్ రోషన్ శ్రీదేవి నటించిన 'కోర్ట్' సినిమాను తమిళంలో 'రంజన్ : ది అడ్వకేట్' పేరుతో రీమేక్ చేస్తున్నారు. టైటిల్ రోల్‌ను ప్రముఖ నటుడు ప్రశాంత్ పోషించ బోతున్నారు. ఈ సినిమాను ప్రశాంత్ తండ్రి, త్యాగరాజన్ డైరెక్ట్ చేస్తున్నారు. దీనిని ప్రముఖ నిర్మాత కతిరేసన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ఇద్దరు వారసులు అరంగేట్రమ్ చేస్తున్నారు. తెలుగులో శ్రీదేవి పోషించిన హీరోయిన్ పాత్రను తమిళంలో ప్రముఖ నటి దేవయాని కుమార్తె ప్రియాంక చేస్తున్నారు. అలానే హర్ష్ రోషన్ చేసిన హీరో పాత్రను నిర్మాత కతిరేసన్ కొడుకు హరి చేస్తున్నాడు. పోక్సో యాక్ట్ నేపథ్యంలో తెరకెక్కబోతున్న ఈ కోర్ట్ డ్రామాకు జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.



## ఐపీఎల్ చరిత్రలో

# తొలి ఫాస్ట్ బౌలర్ గా భువనేశ్వర్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ క్రికెట్ ప్రేమికులకు మరపురాని క్షణాలను అందిస్తోంది. ముఖ్యంగా భారత సీనియర్ స్వింగ్ మాస్టర్ భువనేశ్వర్ కుమార్, టీమ్ ఇండియా రన్ మెషీన్ విరాట్ కోహ్లీ అరుదైన రికార్డులతో ఈ సీజన్‌ను చరిత్రాత్మకం చేశారు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో భువీ తన కెరీర్‌లో అత్యున్నత మైలురాయిని చేరుకోగా, కోహ్లీ బ్యాటింగ్‌లో తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. స్వింగ్ సుల్తాన్ 'డబుల్ సెంచరీ': 200 వికెట్ల మైలురాయి చాలా కాలంగా ఐపీఎల్‌లో అత్యంత పొదుపైన, ప్రభావవంతమైన బౌలర్‌గా గుర్తింపు పొందిన భువనేశ్వర్ కుమార్, ఈ మ్యాచ్‌తో చరిత్ర సృష్టించాడు. చెన్నై యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే వికెట్ తీయడం ద్వారా, ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్ల మైలురాయిని చేరుకున్న తొలి ఫాస్ట్ బౌలర్‌గా భువీ నిలిచాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన టాప్ బౌలర్లు ప్రస్తుతం ఐపీఎల్ వికెట్ల జాబితాను గమనిస్తే భువనేశ్వర్ ఏ స్థాయి దిగ్గజాల సరసన నిలిచాడో అర్థమవుతుంది. ఐపీఎల్‌లో మొత్తం అత్యధిక వికెట్లు తీసిన ఆటగాడిగా యుజ్వేంద్ర చాహల్ (224 వికెట్లు) అగ్రస్థానంలో ఉన్నాడు. అతని తర్వాత భువనేశ్వర్ (200), సునీల్ నరైన్ (193), పీయూష్ చావ్లా (192), రవిచంద్రన్ అశ్విన్ (187), జస్ప్రీత్ బుమ్రా (183) వరుసగా నిలిచారు. ఈ జాబితాలో మెజార్టీ అందరూ స్పిన్నర్లు కాగా ఒక్క పేసర్ గా భువనేశ్వర్ స్థానమే అతని ప్రభావాన్ని స్పష్టంగా చఐపీఎల్‌లో వికెట్ల వేటలో స్పిన్నర్ల హవా ఎక్కువగా ఉంటుంది. ఇప్పటివరకు యుజ్వేంద్ర చాహల్ వంటి స్పిన్నర్లు మాత్రమే ఈ మార్కును దాటగలిగారు. అయితే ఒక పేసర్‌గా 192 మ్యాచ్‌లలోనే ఈ ఘనత సాధించడం భువనేశ్వర్ యొక్క అంకితభావానికి, స్థిరత్వానికి నిదర్శనం. మ్యాచ్ ఆరంభంలో బంతిని రెండు వైపులా స్వింగ్ చేయడంలో సిద్ధహస్తుడైన భువీ.. డెత్ ఓవర్లలో తన యార్కర్లతో బ్యాటర్లను కట్టడి చేయడంలో నేటికీ మేటి అని నిరూపించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతను 4 ఓవర్లలో 41 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టి జట్టు విజయానికి బాటలు వేశాడు. ఒకవైపు భువీ బంతితో మ్యాజిక్ చేస్తుంటే మరోవైపు విరాట్ కోహ్లీ తన బ్యాట్‌తో రికార్డులను తిరగరాశాడు. చెన్నై సూపర్ కింగ్స్‌పై జరిగిన ఈ మ్యాచ్‌లో కోహ్లీ 28 పరుగులు చేసినప్పటికీ ఒక అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్‌లో ఒకే జట్టుపై అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా ఇప్పటివరకు రోహిత్ శర్మ పేరిట ఉన్న రికార్డును కోహ్లీ అధిగమించాడు. రోహిత్ కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 1,161 పరుగులు చేయగా.. కోహ్లీ ఇప్పుడు చెన్నైపై 1,174 పరుగులతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ప్రత్యర్థి ఎవరైనా.. మైదానం ఏదైనా రన్ మెషీన్ ఆపడం ఎవరితరం కాదని ఈ రికార్డు మరోసారి స్పష్టం చేసింది. వయస్సు కేవలం అంకె మాత్రమేనని భువనేశ్వర్ కుమార్ తన స్వింగ్ బౌలింగ్‌తో నిరూపిస్తుంటే ఫామ్ అనేది తాత్కాలికం క్లాస్ అనేది శాశ్వతం అని కోహ్లీ చాటిచెప్పాడు. ఒకే మ్యాచ్‌లో భారత ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు ఇలాంటి మైలురాళ్లను అందుకోవడం ఐపీఎల్ 2026 సీజన్‌కే హైలైట్‌గా నిలిచింది. భువీ సాధించిన ఈ 200 వికెట్ల రికార్డు రాబోయే తరాల ఫాస్ట్ బౌలర్లకు ఒక పెద్ద ప్రేరణగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.



## బ్రేకింగ్ : డ్రంకెన్ డ్రైవ్ కేసులో

# క్రికెటర్ డేవిడ్ వార్నర్ అరెస్ట్

క్రికెట్ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన ఆటగాళ్లలో ఒకరైన డేవిడ్ వార్నర్ తాజాగా ఒక వివాదంలో చిక్కుకున్నారు. సిడ్నీలో మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇప్పుడు క్రీడా ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. మైదానంలో తన దూకుడైన ఆటతీరుతో ప్రత్యర్థులను వణికించే వార్నర్, ఇప్పుడు చట్టపరమైన చిక్కుల్లో పడటం అభిమానులను విస్మయానికి గురిచేస్తోంది. అసలేం జరిగింది? మంగళవారం రాత్రి సిడ్నీ నగర శివార్లలో పోలీసులు సాధారణ ట్రాఫిక్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. రోడ్లపై భద్రతను పర్యవేక్షించే క్రమంలో భాగంగా వాహనదారులకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేస్తున్నారు. ఈ సమయంలో వార్నర్ ప్రయాణిస్తున్న లగ్జరీ వాహనం పోలీసుల తనిఖీ కేంద్రాన్ని సమీపించింది. అయితే పోలీసులు తనిఖీలు చేస్తున్నారని ముందుగానే గమనించిన వార్నర్ తన వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పార్క్ చేయడానికి ప్రయత్నించాడు. వార్నర్ ప్రవర్తనపై అనుమానం వచ్చిన ట్రాఫిక్ పోలీసులు వెంటనే అతడి వద్దకు వెళ్లి విచారించారు. అనంతరం నిర్వహించిన ప్రాథమిక బ్రీత్ అనలైజర్ పరీక్షలో వార్నర్ రక్తంలో ఆల్కహాల్ శాతం చట్టబద్ధమైన పరిమితి కంటే ఎక్కువగా ఉన్నట్లు తేలింది. దీంతో పోలీసులు నిబంధనల ప్రకారం అతడిని తక్షణమే అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు కేసు నమోదు.. బెయిల్ పోలీస్ స్టేషన్‌లో వార్నర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కొన్ని గంటల తర్వాత అతడిని వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్‌పై విడుదల చేశారు. అయితే ఈ కేసుకు సంబంధించి వచ్చే నెలలో స్థానిక కోర్టు ఎదుట విచారణకు హాజరుకావాలని పోలీసులు అతడికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. "చట్టం ముందు ఎవరైనా సమానమే. సెలబ్రిటీ హోదా ఉన్నప్పటికీ ప్రజా భద్రత విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు" అని సిడ్నీ ట్రాఫిక్ విభాగం అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు.

# జలధార విజయానికి అన్నమయ్య జిల్లా ఆదర్శం...!

- జలధారతో కరువు జిల్లాకు నీటి భద్రత -- రాష్ట్రానికి మార్గదర్శకంగా అన్నమయ్య!
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కృషికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రశంసలు...!!




**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** జిల్లాలో నీటి భద్రత సాధనలో "జలధార" కార్యక్రమాన్ని అత్యంత విజయ వంతంగా అమలు చేసిన అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కృషిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రశంసించారు. మంగళవారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ా×=ఇద్రూ=) లో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థల్లో ఉపరితల మరియు భూగర్భ జల వనరుల స్థిరత్వం (సోర్స్ సస్టైనబిలిటీ) అంశంపై నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సుకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగింది. జిల్లాలో అమలు చేసిన జలధార ప్రాజెక్టుపై సదస్సులో కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి అందరికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రివర్యులు మాట్లాడుతూ... అన్నమయ్య జిల్లాలో అమలు చేసిన జలధార ప్రాజెక్టు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. జలధార ద్వారా కరువు ప్రభావిత ప్రాంతమైన అన్నమయ్య జిల్లాలో నీటి వనరుల అభివృద్ధి సాధ్యమైందని, నీటి సంరక్షణలో విప్లవాత్మక మార్పు వచ్చిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రధానంగా కేవలం 5 నెలల్లోనే భూగర్భ జలాలు 8.59 మీటర్లు పెరగడం, 962 మైనర్ ఇరిగేషన్ చెరువుల పునరుద్ధరణ, సుమారు 20,000 ఎకరాల భూభాగానికి నీటి రీచార్జ్, గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం... ఇవి జలధార విజయానికి నిదర్శనాలని పేర్కొన్నారు.

**కలెక్టర్‌కు ప్రత్యేక అభినందనలు**

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ...జలధార ప్రాజెక్టును అంకితభావంతో అమలు చేసి, కరువు జిల్లాను నీటి భద్రత దిశగా తీసుకెళ్లిన కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడానికి మార్గదర్శకంగా తీసుకోవాలని సూచించారు. అలాగే కార్యక్రమంలో పాల్గొన్న నిపుణులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు జలధార ప్రాజెక్టును బాగా స్టడీ చేసి రాష్ట్రవ్యాప్తంగా నీటి సంరక్షణ చర్యలు ప్రభావంతంగా అమలయ్యే విధంగా కృషి చేయాలని సూచించారు.



**జలధార అమలు -- సమగ్ర ప్రణాళిక**

సదస్సులో కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ... జిల్లాలో బేసిన్ ఆధారిత నీటి సంరక్షణ విధానాన్ని అనుసరించి, నదీ పరివాహక ప్రాంతాలను గుర్తించి, మిగులు నీటిని లోటు ప్రాంతాలకు మళ్లించే చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రధానంగా పెన్నా నది పరివాహక ప్రాంతం, చెయ్యేరు, పాపాఘ్ని ఉపనదుల వినియోగం, 49 ఉప పరివాహక ప్రాంతాల గుర్తింపు

532 కాస్కేడ్స్ ద్వారా 382 చెరువుల అనుసంధానం, 962 ఎండిపోయిన చెరువుల పునరుద్ధరణ, ఉపాధి హామీ పథకం ద్వారా విస్తృత పనులు తదితర చర్యల వల్ల వృథాగా పోయే నీటిని సమర్థంగా వినియోగించగలిగామని వివరించారు. వేల కోట్ల వ్యయం అవసరమయ్యే భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు బదులుగా, అందుబాటులో ఉన్న వనరులతోనే 3-4 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకురాగలిగామని కలెక్టర్ తెలిపారు. ఈ అవగాహన సదస్సులో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

# మదనపల్లె తహశీల్దారుపై వేటు..

- కలెక్టర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు..
- అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకున్న కలెక్టర్...







**మదనపల్లె -సూర్య వాస్తవం:**

మదనపల్లె తహశీల్దారు కిషోర్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ చర్యలు తీసుకున్నారు. తహశీల్దారు అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు బాధితుడు విజిల్ బ్లోయర్, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సిసిఎల్ఎ)లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. మదనపల్లె కు చెందిన వెంకటప్ప కుమారుడు బోయపాటి రవి తన ల్యాండ్ మ్యుటేషన్ నిమిత్తం తహశీల్దారు కిషోర్ కుమార్ రెడ్డిని ఆశ్రయించాడు. సదరు తహశీల్దారు వీఆర్ ప్రవీణ్ ను మధ్యవర్తిగా నియమించుకుని రూ.10లక్షలు డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు తన బినామి అకౌంట్ కు రూ.5లక్షలు వేయించుకుని ల్యాండ్ మ్యుటేషన్ కు ప్రొసీడింగ్స్ ఇచ్చాడు. తదనంతరం మూడు రోజుల వ్యవధిలోనే ప్రొసీడింగ్స్ ను క్యాన్సిల్ చేస్తూ జేసీ కి పంపుతున్నామని కొత్త డ్రామాకు తెరతీశాడు. దీంతో బాధితుడు విజిల్ బ్లోయర్, సిసిఎల్ఎ ను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. మదనపల్లె తహశీల్దారు కిషోర్ కుమార్ రెడ్డి వ్యవస్థీకృత అవినీతికి, లంచాలకు అలవాటుపడి బెదిరింపులకు పాల్పడుతూ అధికార దుర్వినియోగం పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మదనపల్లె తహశీల్దారు కార్యాలయంలో తీవ్రమైన అవినీతి వ్యవస్థ నడుస్తోందని, ప్రస్తుత తహసీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి ప్రభుత్వ కార్యాలయాన్ని అక్రమ ఆదాయం పొందే కేంద్రంగా మార్చారని ఆరోపణలు చేశారు. లంచాలకు అలవాటుపడి రైతులు, సాధారణ ప్రజల నుండి బలవంతంగా డబ్బులు వసూలు చేసే విధానానికి నాంది పలికారని తెలిపారు. ఎలాంటి ఫైల్, దరఖాస్తు, ఫిర్యాదు అయినా లంచం లేకుండా ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. వీఆర్ ప్రవీణ్ ను మధ్యవర్తిగా పెట్టుకుని లంచాలు డీల్ చేస్తున్నారని, నేషనల్ హైవే భూమి పరిహారంలో వాటా కూడా కావాలని డిమాండ్ చేశారని తెలిపారు. డబ్బు ఇవ్వకపోతే జీవితాంతం నీపని పూర్తికాదని ప్రవీణ్ బెదిరించడంతో రైతు బినామి పేరు అక్కల రెడ్డికుమారి అకౌంట్ నం: 44560954428 రూ.5లక్షలు పంపాడు. దీంతో అధికార దుర్వినియోగానికి పాల్పడి మార్చి 23న రైతుకు అనుకూలంగా ఆర్డర్ ఇచ్చి, 30వ తేది మాట మార్చి, జాయింట్ కలెక్టర్కు పంపుతానన్నాని సమస్యను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేశారని పేర్కొన్నారు. ఇది ఒక్క కేసే కాదని, మదనపల్లె తహశీల్దారు కార్యాలయంలో ఇలాంటి కేసులు వందల్లో ఉన్నాయని తెలస్తోంది మదనపల్లె తహశీల్దార్ కార్యాలయం కేంద్రంగా భారీ అవినీతి నెట్వర్క్ సాగుతోందన్నారు. రైతులను అడ్డంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ ఫిర్యాదు పై తహశీల్దారు ను కలెక్టరేట్ కు అటాచ్ చేస్తూ జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

# లక్కిరెడ్డిపల్లి ఆర్టీసీ బస్టాండును వెంటనే ప్రారంభించాలి

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** లక్కిరెడ్డిపల్లి లోని ఆర్టీసీ బస్టాండు 40 లక్షల రూపాయలతో పూర్తిచేసి ప్రారంభించకుండా నిరుపయోగంగా వదిలేశారని బస్టాండ్ వెంటనే ప్రారంభించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాల్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన బస్టాండ్ ను ఉద్దేశిపూర్వకంగా వాడుకోలోకి తీసుకు రాకపోవడం చాలా బాధాకరమన్నారు. ఆర్టీసీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ ప్రజల సొమ్ముతో నిర్మించిన భవనాలను నిరుపయోగ వదిలేయడం బాధ్యత రాహిత్యానికి నిదర్శనం అన్నారు. ఆర్టీసీ అధికారులు కేవలం పేపర్ల పై పనులు పూర్తయ్యాయని చూపించి ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రయాణికులకు రోడ్డుపక్కనే ఎండలో వర్షంలో బస్సుల కోసం గంటలు తరబడి నిలిచి ఉన్నారని ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్య ధోరణి వదిలి ఆర్టీసీ బస్సులను బస్టాండ్ కు మళ్లింపు చేసి ప్రయాణికులను బస్టాండ్ వచ్చేటట్టు చూడాలన్నారు. అలాగే మరుగుదొడ్లు త్రాగునీరు వసతులు కల్పించాలని వారు ఆర్టిసి అధికారులను కోరారు. అధికారులు స్పందించకపోతే అవసరమైతే రాస్తారోకోలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ నాయకులు కొమ్ము ఓబులేసు ఆంజనేయులు జగన్ బాబు తదితరులు పాల్గొన్నారు.




## ఐ.ఎం.ఎం మెహబూబ్ భాష కుమార్తె వివాహానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురంలో ఈనెల 12వ తేదీ జరిగే ఐ ఎమ్ ఎమ్ మహబూబ్ బాషా కుమార్తె వివాహ వేడుకకు హాజరు కావాలని కోరుతూ సింగనమల్ల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ను కోరి ఆహ్వాన పత్రికను అందించారు ఐ ఎమ్ ఎమ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మహబూబ్ బాషా. మంగళవారం నాడు స్థానిక ఎమ్మెల్యే నివాసం కలిసి నవ వధూవరులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వివాహ వేడుకకు తప్పకుండా హాజరవుతానని తెలియజేశారు.

## ఆర్కే వ్యాలీ ట్రిబుల్ ఐటీలో గందరగోళం

**- గాడి తప్పిన ఈ2 విద్యార్థులు**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** వేంపల్లె ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీలో గందరగోళం నెలకొంది. సోమవారం రాత్రి ఈ 2 విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ జరిగినట్లు సమాచారం. గాయపడ్డ ఈ2 విద్యార్థి వారి తల్లిదండ్రులకు సమాచారం తెలపడంతో ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీకి చేరుకున్న విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు ఘర్షణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. డైరెక్టర్ ఛాంబర్ లో వారితో మాట్లాడుతున్న సమయంలో విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు.. ఇలాంటి సంఘటనలు జరిగి తమ విద్యార్థి సూసైడ్ చేసుకుంటే ఎవరు బాధ్యత తీసుకుంటారంటూ ట్రిబుల్ ఐటీ అధికారులను విద్యార్థి తల్లిదండ్రులు బంధువులు నిలదీశారు. ఒకవేళ పిల్లవాడు చనిపోయి ఉంటే సూసైడ్ చేసుకున్నారని సమాచారం తెలిపేవారిని, ట్రిబుల్ ఐటీ అధికారులను విద్యార్థి తల్లిదండ్రులు నిలదీశారు. ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీ లో పరిపాలన గాడి తప్పిందంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్లలో, డైరెక్టర్ ఛాంబర్‌లో ట్రిబుల్ ఐటీలో జరుగుతున్న సమస్యలపై పంచాయతీలు జరుగుతు న్నాయని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఘర్షణకు సంబం ధించిన సమాచారం తెలపకుండా ట్రిబుల్ ఐటీ అధికారులు గోప్యంగా ఉంచారు అన్నది గమనార్హం.

## రాజకీయాల్లో పెచ్చుమీరుతున్న వ్యక్తిగత దూషణలు

**-ఏబీఎన్ రాధాకృష్ణ వ్యాఖ్యలపై వెల్లువెత్తుతున్న నిరసన"**



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే ఇంచార్జ్ వై విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఏబిఎన్ రాధాక్రిష్ణ వైసీపీ నాయకులు కార్యకర్తలపై చేసిన వాక్యలు చాలా దిగుస్భాహ కారంగా ఉన్నాయి. ప్రజలు రాధాక్రిష్ణని అసహించికుంటున్నారు వైసీపీ నాయకులు కార్యకర్తలు వారి భార్యలని చెల్లెలిగా భావించి వారు వేరేవాళ్లకి ఇచ్చి పెళ్లిళ్లు చేస్తారు. వైసీపీ నాయకులు కార్యకర్తలు మూర్ఖులు అన్నట్లుగా వాక్యలు చేసాడు. ఇలాంటి మాటలను సమాజం హర్షించదు. ఆడవారిని కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ పై ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన వస్తుంది. రాబోయే కాలంలో ఈ ప్రతిపాదన చాలా బాగుంది అని మచిలీపట్నం, విజయవాడ గుంటూరు చుట్టుపక్కల ప్రాంతాలు కూడా రాబోయే కాలంలో ఈ ప్రతిపాదన అమలు చేస్తే బాగుంటుంది అని ప్రజల నుండి ఈ అభిప్రాయం పట్ల సానుకూలత పెరుగుతున్న కొద్దీ చంద్రబాబు నాయుడు అనుకూల మీడియా వాటిని జిర్ణించుకోలేక పోతున్నారు. రేణుక చౌదరి రాజ్యసభలో ల మాట్లాదిన మాటలు కానీ ఇక్కడ ఆంధ్రజ్యోతి లో రాధాక్రిష్ణ మాట్లాడిన మాటలు కాను వీరిపై కేసులు బనాయించి జైలులో పెట్టాలి. ఆడవారిపై ఇలాంటి పద్ధతిలో మాట్లాడడం చాలా బాధాకరం చంద్రబాబు గారికి బాధ కలిగిందని ని రాధాకృష్ణకి కోపం వచ్చినట్లు ఉంది మీరు చెప్పే సూత్రం మీకు కూడా వర్తిస్తుంది కదా మేము కూడా మాట్లాడవచ్చు కదా మీ భార్యను చెల్లిగా చూస్తారా ఈరోజు చంద్రబాబు నాయుడు కూడా విజ్ఞత ప్రదర్శించాలి తప్ప మూర్ఖంగా లక్షల కోట్లు ఖర్చుపెట్టి నేను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అని ముందుకు పోకుండా ఈరోజు రాష్ట్ర పరిస్థితి దృష్టిలో పెట్టుకొని ఆలోచించాలని తెలియజేస్తున్నాను.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )

## నేడు సర్పంచులు, కౌన్సిలర్లకు 'ఆత్మీయ సన్మానం'

### ఆహ్వానం పలికిన జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం:** పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచులు,కౌన్సిలర్ల సేవలను గౌరవిస్తూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నేడు పులివెందులలో భారీ ఆత్మీయ సన్మాన కార్యక్రమం బుధవారం కదిరి రోడ్డు నందుగల ఎస్ ఎస్ సి ఎస్ ఆర్ కళ్యాణ మండపం నందునిర్వహించనున్న సందర్భంగా జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి పేరుపేరునా ఆహ్వానాన్ని పలికారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారధిలా నిలిచి,గ్రామాల మరియు పట్టణాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ప్రజాప్రతినిధుల అమూల్యమైన సేవలను గుర్తు చేసుకుంటూ ప్రజల కోసం అహర్నిశలు శ్రమించిన సర్పంచులు,కౌన్సిలర్ల సేవలు అభినందనీయం అని జగనన్న ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ ఆత్మీయ కలయికకు నియోజకవర్గ పరిధిలోని సర్పంచులు,కౌన్సిలర్లు మరియు పార్టీ ముఖ్య నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఎంపీ అవినాష్ రెడ్డి కోరారు.

## నాయుడుపేటకు విచ్చేసిన ఎస్సీ కమిషన్ సభ్యులకు ఘన స్వాగతం

**- జనసేన నాయకులు**

**డా. పాకాటి గౌతమ్ రాజ్, డా. శ్రీపతి బాబులకు మర్యాదపూర్వక ఆహ్వానం**



**నాయుడుపేట - సూర్య వాస్తవం:** అధికారిక కార్యక్రమం నిమిత్తం నాయుడుపేటకు విచ్చేసిన ఎస్సీ కమిషన్ సభ్యులు మరియు జనసేన నాయకులు డా. పాకాటి గౌతమ్ రాజ్, డా. శ్రీపతి బాబుకి సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి, నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ( ఏఎంసీ) చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ఆధ్వర్యంలో స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు పూలమాలలు వేసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అట్ల కృష్ణరావు, బాలు శెట్టి తదితర నాయకులు పాల్గొని, నాయుడుపేటకు వచ్చిన అతిథులను సాదరంగా స్వాగతించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, కమిషన్ సభ్యులు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది

## జగన్ మోహన్ రెడ్డి ని కలిసిన కడప జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు డివి శశికాంత్ రెడ్డి



**తొండూరు - సూర్య వాస్తవం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మరియు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని మంగళవారం తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పలువురు పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు డి.వి. శశికాంత్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి ని కలిసి పార్టీ కార్యక్రమాలు, జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. అలాగే ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామిరెడ్డి పుల్లారెడ్డి, దాసరి ఈశ్వర్ రెడ్డి, దాసరి దేవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ బలోపేతం, స్థానిక సమస్యలు మరియు భవిష్యత్ కార్యక్రమాలపై నాయకులు తమ అభిప్రాయాలను జగన్ తో పంచుకున్నట్లు తెలిసింది. ఈ భేటీ పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నేతలు పేర్కొన్నారు.

## పేద విద్యార్థుల కలల సాకారమే అటల్ టింకరింగ్ ల్యాబ్



**లక్కిరెడ్డిపల్లి - ఎసూర్య వాస్తవం:** పేద విద్యార్థుల కలల సహకారం కోసమే ప్రధానమంత్రి మోడీ ప్రభుత్వ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్లు ఏర్పాటు చేశారని డి ఆర్ పి షేక్ షర్ఫుద్దీన్ పేర్కొన్నారు. సర్వ శిక్ష అభియాన్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఏపీ మోడల్ స్కూల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో విద్యార్థులకు బూట్ స్కిల్ డెవలప్మెంట్ పై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న యుగంలో పేద విద్యార్థులకు బూట్ అటల్ టింకరింగ్ ల్యాబ్లు ఏర్పాటు చేసి ఎంతోమందిని పేద విద్యార్థులను గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం అటల్ టింకరింగ్ ల్యాబ్ లు ఏర్పాటు చేసిందన్నారు. చివరి రోజున విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

## లక్కిరెడ్డిపల్లి సిహెచ్‌సి సూపరిండెంట్ పదోన్నతి పై బదిలీ



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** లక్కిరెడ్డిపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ విష్ణు శివ ప్రసాద్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ నుండి సివిల్ సర్జన్ గా పదోన్నతి బదిలీపై పుంగనూరు 100 పడకల ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. డాక్టర్ విష్ణు శివప్రసాద్ తక్కువ కాలంలోనే లక్కిరెడ్డిపల్లి మండల ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేశారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులతో ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు ఓపికతో వింటూ వైద్యం చేసేవాడని ప్రజలు మెచ్చుకునే వారు. ఆయన లక్కిరెడ్డిపల్లి ఆరోగ్య కేంద్రానికి వచ్చిన తర్వాత ఓపి దాదాపు 350 మంది పైగా రోగులు ప్రతిరోజు వచ్చేవారు ఆరోగ్య కేంద్రంలోని ప్రసవలు ఆపరేషన్లు జరిగాయి అనిప్రజలు మెచ్చుకునేవారు. ఇక్కడ పనిచేసిన మరొక డాక్టర్ భరత్ రిమ్స్ మెడికల్ కాలేజీకి బదిలీపై వెళ్లారు డాక్టర్ భరత్ లక్కిరెడ్డిపల్లి నివాసి కావడం రాత్రి వేళలో రోగులకు తన డ్యూటీ కాకపోయినా రోగులకు వైద్యం చేసేవాడు రోగుల మన్ననలు పొందారు. ఈ కార్యక్రమంలో డా కీర్తి రెడ్డి, డా సులోచ, డా యన్, డా, శివ ప్రసాద్, డా సింధుజా తదితరులు పాల్గొన్నారు

### హిమాచల ప్రదేశ్, ఉత్తరకాండ రాష్ట్రాల మాదిరిగా

# రాష్ట్రానికి ఉపాధి హామీ నిధులు 90శాతం ఇవ్వాలి



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి హిమాచల ప్రదేశ్,ఉత్తర కాండ రాష్ట్రాల మాదిరిగా ఆం ధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉపాధి హా మీ నిధులు 90% ఇవ్వాలి వీ రభద్రస్వామి.సిపిఐ జిల్లా కా ర్యవర్గ సభ్యులు,గుంతకల్ గు త్తి కేంద్ర ప్రభుత్వాలు ఒక సం క్షేమ పథకాన్ని ప్రవేశపెట్టాలి అన్నప్పుడు దేశానికి ఉపయో గపడినటువంటి మహాత్ముని పేరు ద్వారా పథకానికి పెడ తారు.అదేవిధంగా ఉపాధి హా మీ పథకానికి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పని పథకం అ ని పెట్టడం జరిగింది.అనంత పురం నగరం నుండి బండ్లప ల్లి వరకు పాదయాత్ర కార్యక్ర మంలోసిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి రాజా, జాతీయ కార్యదర్శి కామ్రేడ్ రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్య దర్శి ఈశ్వరయ్య,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రే డ్ డి జగదీష్,సిపిఐ రాష్ట్ర కా ర్యవర్గ సభ్యులు జాఫర్.మరి యు జాతీయ రాష్ట్ర జిల్లాల నాయకులు పాల్గొనబోతున్నా రు.ఈ సందర్భం గా సిపిఐ కా ర్యాలయంలో పాదయాత్ర కు సంబంధించినటువంటి కర ప త్రాలు ఆర్‌డబి బంగ్లాలో వి డుదల చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కా ర్యవర్గ సభ్యులు వీరభద్ర స్వా మి సిపిఐ మండల కార్యదర్శి రాందాస్,సీపీఐ పట్టణ సహా య కార్యదర్శిలు మముదా బీ,నజీర్ ,సీపీఐ,మండల,సహాయ కార్యదర్శిలు నరసిం వయ్య,వెంకటరాముడు సీ పీఐ నాయకులు షఫీ,డ్యానీ యల్,గోపాల్ పాల్గొన్నా,ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కా ర్యవర్గ సభ్యులు వీరభద్ర స్వా మి మాట్లాడుతూ.మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని 2005లో నామకరణం చేయడం జరిగింది.ఆనా టి రాజకీయ పార్టీలు అందరు కూడా మహాత్మా గాంధీ నామ కరణం సరైనదే అని చెప్పడం ద్వారా నామకరణం చేయడం జరిగింది.గ్రామీణంలో ప్రజలు ఆర్థికంగా నిల్తుక్కోవాలనే స్వ తంత్రం మునుపు నుంచి మ హాత్మా గాంధీ పోరాటాలు చేసి నటువంటి నాయకుడు.అం దుకోసమే అతని పేరు మీదే ఉపాధి హామీ పనిని నా మకర ణం చేశారు.ఏ బి జీ రాంజీ అ ని ఎన్డిఏ ప్రభు త్వం,ఉపాధిహా మీ పథకానికి నామకరణం చేసింది.ఏ బి జి రామ్ జి అని మహాత్మా గాంధీ ని చంపిన గాడ్సే (ఆర్ఎస్ఎస్ వా ది) పేరు పెట్టడం చాలా బాధా కరం (భారతదేశ స్వతంత్రంలో చుక్క రక్త ము చిందించని వ్యక్తి గాడ్సే) గ్రామా ల్లో ఉన్న ప్రజలకు ఉపాధి ఎక్కువగా దొరుకుతుందా లేదా అన్న ఆలోచ న చేయకుండా గాంధీ అనే పేరుని లేకుండా చేయడానికి ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న టువంటి బిజెపి చేస్తున్న కుట్ర ఇది.ఒక్కసారి మహాత్మా గాం ధీ ఉపాధి హామీ పథ కాని కి ఏబి జీ రామ్ జి పథకాలకు వ్యత్యాసాన్ని పరిశీలిద్దాం.గతంలో దేశవ్యాప్తంగా 12 కోట్లు మందికి జా బు కార్డులు ఉండేవి.కేంద్ర బడ్జెట్లో లక్ష 1,11,170 కోట్లు బడ్జెట్ కేటా యించారు.నేడు 4 కోట్ల 71 లక్షల మంది మాత్రమే జాబ్ కార్డులు ఉన్న వి.వీరికి బడ్జెట్లో 86 వేల కోట్లను బ డ్జెట్ కేటా యిస్తున్నారు.దేశవ్యాప్తం గా నేటికి 13 వేల కోట్లు బకాయి లు ఉన్నాయి.నేడు ఎన్డీఏ ప్ర భుత్వం ఏ బి జీ రాంజీ అని పేరును మార్చి దే శంలో ఉన్న టువంటి ప్రజలకు ఎటు వంటి సేవలు చేయని ఆర్ఎస్ఎస్ వ్యక్తిని ఈరోజు నామకరణం చేస్తు న్నారు.రాష్ట్ర ప్రభుత్వం 40% బ డ్జెట్ కేటాయించాలని సంవత్సరం లో బడ్జెట్ మొత్తా న్ని వాడుకోవా లి.వాడుకోక పోతే కేంద్రం ఇచ్చే 60 శాతం కోటాను కూడా తగ్గిస్తారు. కేంద్ర ప్రభుత్వం చెప్పిన ప్రాంతంలో నే పనులు చేయించాలి.ఉపాధి హా మీ పనిముట్లకు రాష్ట్ర ప్రభుత్వం 25% డబ్బు లు కేటాయించాలి. జా బ్ కార్డు 15 రోజుల్లో ఇవ్వకపోతే ని రు ద్యోగ భృతి గతంలో కేంద్రం ఇచ్చే ది.నేడు ఆ నిరుద్యోగ భృతి రాష్ట్ర ప్రభుత్వాలపైనే పెడుతుంది. ఇలా అనేకమై నటు వంటి ఇబ్బందులు ఏ బి జి రాం జీ పథకంలో ఉన్నాయ ని నాయకులు మాట్లాడటం జరిగింది. రాష్ట్ర విభజన జరిగే ముందు విభజ న హామీలు రాష్ట్రంలో అమలుపర చలేదు.అందుకు బదులుగా నేడు హి మాచల ప్రదేశ్,ఉత్తరఖండ్ రా ష్ట్రాలలో ఉపాధి హామీ పథకా నికి 90% నిధులు ఎలా కేటా యిస్తు న్నారో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము లో కూ డా 90% ఉపాధి హామీ పథకనికి నిధులు కే టాయించాలని నాయ కులు కోరుతున్నారు.వీటన్నిటికీ అ మలుకై ఈనెల 10వ తారీఖు నుండి 12 వ తారీకు వరకు అనంతపురం నగరం నుండి బండ్లపల్లి వరకు 12 వ తేదివరకు పాదయాత్ర,12 వతేదీ న బండ్లపల్లి లో బహిరంగ సభ ని ర్వహించడం జరుగుతోంది.ఈ కార్య క్రమా నికి సిపిఐ రాష్ట్ర సిపిఐ కేంద్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి రాజా, సిపిఐ జాతీయ నాయకులు రామ కృష్ణ,జాతీయ నాయకులు తో పా టు రాష్ట్ర నాయకులు కూడా పాల్గొ నబోతు న్నారు.అని ఈ సందర్భంగా కర పత్రాలు విడుదల చేయడం జరి గింది.ఈ కార్యక్రమం లో మధుమ తి,నారాయణస్వామి, రామంజి,రాజా, పులి కొండ ,వెంకటేశు మొదల గు వారు పాల్గొనడం జరిగింది...

# ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం పై దాడి అనాగరిక చర్య

### - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

**శాంతిపురం - సూర్య వాస్తవం**

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం పై దాడి అనాగరిక చర్య అని మాజీ శాసనమండలి సభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి,మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు గౌని వారి శ్రీనివాసులు ఖండించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.రాజధాని విషయంలో జగన్ రెడ్డి వైఖరిని ప్రశ్నించినందుకు అల్లరిమూకలతో కలిసి మాజీ మంత్రులు మీడియా సంస్థపై దాడికి తెగబడటం అత్యంత దుర్మార్గమన్నారు. ఇది వైసీపీ రాక్షస సంస్కృతికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో జీవో 2430 వంటి నిరంకుశ నిర్ణయాలతో మీడియా గొంతు నొక్కే ప్రయత్నం చేసిన జగన్, ఇప్పుడు ఏకంగా దాడులకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. తన సొంత మీడియాలో ఇతరులపై ఇష్టానుసారం ఆరోపణలు చేస్తూ, తమ వైఫల్యాలను ఎత్తిచూపితే దాడులు చేస్తారా అని నిలదీశారు. రాష్ట్రంలో వైసీపీ పోకడలను, మూర్ఖత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారని, ప్రజా కోర్టులో వారికి శిక్ష పడక తప్పదు అన్నారు. ఇలాంటి చర్యలు పత్రికా స్వేచ్ఛను హరించడమేనని విమర్శించారు. ఎదుటివారి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దాడులకు దిగడం వైసీపీ నైజమని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి రాక్షస కృత్యాలకు తావులేదని స్పష్టం చేశారు.

## పారిశుధ్య కార్మికులకు 'నమస్తే' అవగాహన సదస్సు



**పులివెందుల - అర్బన్ సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమం మరియు వారి ఆరోగ్య రక్షణే ధ్యేయంగా పులివెందుల పురపాలక సంఘం కార్యాలయంలో నమస్తే పథకం కింద సామర్థ్య పెంపు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.మునిసిపల్ కమిషనర్ సి.మునికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులకు కీలక సూచనలు చేస్తూ రక్షణ పరికరాలను పంపిణీ చేశారు. పారిశుధ్య పనుల సమయంలో కార్మికులు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని వ్యక్తిగత రక్షణ పరికరాల (పీపీఈ) ప్రాముఖ్యతను కమిషనర్ వివరించారు.వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అంటువ్యాధుల నుండి ఎలా రక్షణ పొందవచ్చో కార్మికులకు అవగాహన కల్పించారు.పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య సిబ్బంది పాత్ర వెలకట్టలేనిదని, వారి సేవలను ఈ సందర్భంగా అధికారులు కొనియాడారు.శిక్షణ అనంతరం కార్మికులకు ప్రభుత్వం తరపున కేటాయించిన పీపీఈ కిట్లను కమిషనర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్మికుల భద్రతే మా ప్రాధాన్యత అని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రక్షణ కవచాలను ధరించి విధులకు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ తెలియజేశారు.?ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అజయ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వివిధ వార్డు సచివాలయాల పర్యావరణ కార్యదర్శులు మరియు పెద్ద సంఖ్యలో పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



### కనేకల్‌లో రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు

## ఎస్కే మల్లికార్జునకు ఘన సన్మానం

**కనేకల్ - సూర్య వాస్తవం:** రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడిగా నియమితులైన ఎస్కేమల్లికార్జునకు కనేకల్ సొసైటీ బ్యాంక్ చైర్మన్ వాల్మీకి నాగార్జున మరియు గ్రామ పెద్దలు ,కనేకల్ మండల కురుబ సంఘం నాయకులు మంగళవారం ఘన సన్మానం నిర్వహించారు.ఈసందర్భంగా మండలానికి చెందిన కురుబ సంఘం నాయకులు, సభ్యులు పెద్ద ఎత్తున హాజరై ఆయనకు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు ఎస్కే మల్లికార్జున నియామకం కురుబ సంఘానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆయననాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కురుబ సమాజ హక్కుల పరిరక్షణకు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు, విద్యా రంగంలో పురోగతికి ఆయన కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.తనకు లభించిన ఈ గౌరవానికి స్పందించిన ఎస్కే మల్లికార్జున మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. సమాజ అభ్యున్నతే తన ప్రధాన లక్ష్యమని, అందరి సహకారంతో ముందుకు సాగుతానని తెలిపారు. సంఘం బలోపేతానికి, సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో మండలంలోని కురుబ సంఘం ముఖ్య నాయకులు, యువ నాయకులుమరియు సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

## మారుమూల గ్రామంలో మెరిసిన ఆణిముత్యం



**వేంపల్లె - సూర్య వాస్తవం:** వేంపల్లె మండలంలోని మారుమూల గ్రామమైన గిడ్డంగివారిపల్లె గ్రామానికి చెందిన గోర్ల కావేరి యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల మండల జడ్పీటిసి మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గిడ్డంగివారిపల్లె గ్రామానికి చెందిన గోర్ల కావేరి పులివెందుల జేఎన్ టియుఏ లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ 2021-25 పూర్తి చేసింది. ఇందులో గోర్ల కావేరి మొదటి ర్యాంకు సాధించింది. దీంతో ఆమె గోల్డ్ మెడల్ కు అర్హత పొందింది . అనంతపురంలో జేఎన్ టియుఏ యూనివర్సిటీ లో జరిగిన 15 వ కాన్వికేషన్ కార్యక్రమంలో గోర్ల కావేరి గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంది. అనంతరం గోర్ల కావేరి మాట్లాడుతూ పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, నాకు గోల్డ్ మెడల్ రావడం సంతోషంగా ఉందని తెలిపారు. సివిల్ సర్వీస్ లో ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని గోర్ల కావేరి తెలిపారు. ఆమె గోల్డ్ మెడల్ సాధించడం పట్ల గిడ్డంగివారిపల్లె గ్రామస్తుడయిన మండల జడ్పీటిసి మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.